# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎన్.రామతారక వరబ్రహ్మశాస్త్రి

మిస్.వి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 31 Issue 7

No.of Pages 40

MARCH 2012

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో....** **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| అభయం సర్వభూతేభ్యో దదామి | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 14 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 16 |
| పరిప్రశ్నేన సేవయా | 19 |
| శివానందలహరి | 20 |
| సమర్థసద్గురు యాజమాన్యం | 22 |
| ఆధ్యాత్మిక దృక్పథంలో సామ్యవాదం | 23 |
| సింహావలోకనం | 25 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 28 |
| మహాకాశం - ఘటాకాశం | 30 |
| అపరోక్షానుభూతి | 32 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ సత్సంగం | 34 |
| మాణిక్యవాచాకర్ | 36 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

***జాతి నీతి కుల గోత్ర దూరగం నామ రూప గుణదోష వర్జితం ।***
***దేశకాల విషయాతి వర్తియద్బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥***

ఆత్మానుభవం కలగటం అంత సులభం కాదు. అలాగని అసాధ్యమూ కాదు. సత్యానుభవం కలిగిన శ్రీశంకరభగవత్పాదులవారు మానవ దేహంలో ఉంటూనే, సాధకుడికి మాటకి మనసుకి అందని సత్యాన్ని సామీప్య, సారూప్య, సాయుజ్య స్థితులలో అందజేయ లేకపోతే సత్యాన్వేషణ అనేది నమ్మదగినదిగా ఉండదు. అందువలననే మహాత్ముల జీవితాలు సాధకమయంగాను, మార్గదర్శకంగానూ ఉంటాయి.

జాతి నీతి కుల గోత్రాలకు సంబంధము లేనిది, నామ రూప గుణ దోష రహితమైనది మరియు దేశ కాల విషయాదులకు ఆవలనున్న 'పరబ్రహ్మవు నీవే' అన్నంత మాత్రంచేత , లేక భావన చేసినంత మాత్రాన ఆ స్థితిని అనుభవించ గల్గుతాడా? సత్యానుభవం పొందని దేహము నిరర్ధకం. నశించేవన్నీ వస్తువులే. సాధకులు తమను తాము వదులుకోవాలి. తనలోని నేను, నాది అనబడే అహంకార మమకారాలు వదులుకోవాలి. ప్రపంచంలో మోహాతీతంగా ఉండటం అంత సులభం కాదు. సాధకులు ఏకాంతంలో సమూహాన్ని, సమూహంలో ఏకాంతాన్ని సృష్టించుకుని బయట జరుగుతున్న ఏ విషయమూ తమపై ప్రభావము పడనీయకుండా మనగలగాలి.

నిష్కామకర్మ తత్త్వవిచారణ నివృత్తి మార్గానికి తీసుకునివెళ్తుంది. మనస్సు నమస్కారాలకు తిరస్కారాలకు అతీతంగా ఉండాలి. జీవుడు వస్తువుతో కూడినప్పుడు కల్గేది భోగం. తనతో తాను కూడి ఉన్నప్పుడు కలిగేది యోగం. యోగం ఆనందాన్నిస్తుంది. భోగం మార్పుతో కూడినది. తనతో తాను కూడి ఆనంద స్థితిలో ఉన్న సాధకుని దేహమే దేవాలయం. ఆ స్థితిలో నా జాతి, నా కులం, నా గోత్రం, నేను, నాది అనేవన్నీ నశించి తన నిజస్థితిని గుర్తించిన జీవన్ముక్త స్థితిలో ఉంటాడు.

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

# అమ్మ ఆశీస్సులు

***అచ్చుతోఽస్మి మహాదేవ తవకారుణ్య లేశతః ।***
***విజ్ఞానఘన యేవాఽస్మి శివోఽస్మి కిమతః పరమ్ ॥***

మహాదేవుడైన శ్రీ సద్గురుదేవుని సన్నిధిలో కుమారస్వామి శిష్యస్థానంలో ఉండి తన అనుభవమును ఆనందంతో నివేదిస్తున్న సందర్భం. "హే మహాదేవా! తవకారుణ్య లేశతః - నీ కరుణ లేశమాత్రము చేతనే అచ్యుతోస్మి - చ్యుతము కానిది, శ్వాశుతడనయ్యాను. ఇంతేకాదు ప్రభూ! విజ్ఞానఘన యేవ - విజ్ఞాన ఘనుడను, అస్మి -అయ్యాను. శివోఽస్మి - మంగళస్వరూపుడను అయ్యాను. కిమతః పరమ్? - ఇంకేమి కావలెను? అని చెబుతూ స్కందోపనిషత్తు మొదలైంది.

శ్రీసమర్థులైన సద్గురుదేవుల ఆశ్రయము లభించిన సచ్ఛిష్యుడు ఎంత ధీమంతుడు అవుతున్నాడు? అట్టి శిష్యునకు అలభ్యమైనది ఏమున్నది? అట్టి శ్రీగురుపాదాశ్రయమందున్నవానికి సర్వమూ గురుమయమే కదా!

***గురుమధ్యే స్థితమ్ విశ్వమ్ । విశ్వమధ్యే స్థితో గురుః ।***
***గురుర్విశ్వమ్ । నచాన్యోఽస్తి । తస్మై శ్రీ గురవే నమః ॥***

శ్రీగురునాధుని యందు విశ్వమున్నది. ప్రపంచం మధ్య గురువు ఉన్నాడు. కావున గురువునకు విశ్వమునకు భేదము లేదు. రెండునూ అతడే. అట్టి గురువునకు నమస్కారము.

శ్రీగురుదేవులు చేసిన అనంతమైన విశ్వములో వారే నిండియున్నారు. వడ్లగింజలో బీజములో చెట్టు దాగి ఉన్నట్లు చెట్టు గొప్పదా? విత్తనము గొప్పదా? అంటే దాన్ని గురించి వివరించి చూపిస్తున్న గురుపరబ్రహ్మము అంత గొప్పవారు. అట్టి శ్రీగురుదేవుల దయకు మనమందరమూ పాత్రలగుదుము గాక!

శ్రీసద్గురు చరణ సేవలో
మీ అమ్మ

# బాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

శ్రీకృష్ణుని వివరణ విన్న రుక్మిణి మనస్సు ఆర్ద్రమైంది. తనకు యీ జ్ఞానాన్ని కలిగించటానికే స్వామి యీ సన్నివేశాన్ని కల్పించాడని అర్థం చేసుకున్నదామె. పరమ కృతజ్ఞతా భావంతో ‘ ఓదేవదేవా! నీ దివ్యలీల నీకు తప్ప యితరులకు ఎలా అర్థమవుతుంది దయామయా! నీ వివరణతో నాకు ఒక మహారస్యం తెలిసిందని మళ్ళీ మళ్ళీ ప్రణామం చేసింది.‘దురత్యయమైన స్వామి మాయనుఆయన ప్రాపకంతో దాటవలసిందేగాని, దానికి మరొక మార్గం లేదుకదా!’ అనుకొని సంతోషించింది.



రుక్మిణి వలెనే, అర్జునుడు శ్రీకృష్ణుని సంపూర్ణంగా విశ్వసించిన మరొక భక్తుడు. అతడు నరుడు కావటం వలన నరజాతి సమస్థానికీ సంకేతం. అలా అర్జునునివలెనే, రుక్మిణిని వలెనే శ్రీసద్గురుమూర్తి యందు అచంచలమైన విశ్వాసం ఉంచితే అందనిదంటూ ఏముంటుంది? అర్జునుడి వలె గురుకృపకు పాత్రుడై, గీతామృతమనే జ్ఞానామృతాన్ని పొంది అమృత స్వరూపుడై ప్రకాశించగలడు.

భగవంతుడి ప్రేమ దివ్యమూ, అవ్యాజమూ, శాశ్వతము. దారా పుత్రాదుల ప్రేమ స్వార్థపూరితమూ, అస్థిరము. మానవులలో ఒకరికీ యింకొకరికీ మధ్య ఉండే ప్రేమ యొక్క వాస్తవ తత్వాన్ని వింగడించుకో గలిగితే మనకు దాని సత్య స్వరూపం బోధపడుతుంది.

రత్నాకరుడు పరమ మూర్ఖుడు, కటికవాడు. అతడు సప్తర్షుల ప్రబోధంతో దారా పుత్రుల వద్దకు వెళ్ళి యిలా అన్నాడు........

“అనేక హత్యలూ, దోపిడీలూ చేసి యింతకాలమూ నన్నూ, మిమ్మల్నీ పోషిస్తూ వస్తున్నాను. కానీ, అది మహాపాపమని నాకు యిప్పుడే తెలిసింది. దొంగతనాలూ, హత్యలూ మహా పాపకార్యాలట. మీరందరూ నేను దోచి తెచ్చిన ధనాన్ని అనుభవిస్తున్నారు. మరి మీరంతా నేను సంపాదించే పాపంలో పాలు పంచుకుంటారా?”

"నువ్వు మమ్మల్ని ఎలా పోషిస్తావో అది నీ వ్యవహారం. మమ్మల్ని పోషించే బాధ్యత నీది. కనుక నేనుగాని, నా పిల్లలు గాని నీవు సంపాదించే పాపాన్ని పంచుకోవలసిన అవసరం లేదు. కనుక పంచుకోము" అని దృఢంగా, స్పష్టంగా సమాధానం చెప్పింది రత్నాకరుడి భార్య.

తన భార్య సమాధానినికి కళ్ళు తిరిగిపోయాయి రత్నాకరుడికి. అతనికి కనువిప్పు కలిగింది. తన దారాపుత్రుల ప్రేమకు స్వార్థమే కారణమని అతనికి అర్థమైంది. ఎప్పుడైతే అతనికి యీ విషయం అర్థం అయిందో, ఆ క్షణంలోనే అతనిలో గొప్ప మార్పు వచ్చింది.

అతను అస్థిరమైన దారా పుత్రుల ప్రేమను త్యజించి, సుస్థిరమైన భగవంతుడి ప్రేమ కొరకు ఆరాట పడ్డాడు. మహాభక్తుడైనాడు. మహాజ్ఞాని అయినాడు. తనను తాను శ్రీరామచంద్ర పాదార విందాలకు అంకితం చేసుకుని, మహా మధురమైన రామాయణ ఝుంకారం చేయగల భ్రమరం లాగ మారిపోయాడు.

సర్వ మానవ యత్నాలకూ భగవత్పాద పంకజ మకరందాస్వాదనయే ధ్యేయం కావాలి. అదే మానవ జన్మకు నిజమైన లక్ష్యం. ఎలా నదులన్నీ సముద్రంలో కలిసేంతవరకూ హోరెత్తి అశాంతితో అలమటించి, చివరకు సాగర సంగమంతో ప్రశాంతిని పొందుతాయో, అలాగే మానవుడు భగవంతుడిని చేరినప్పుడు గాని ప్రశాంతి లేదు.

నారాయణుని తెలుసుకున్నప్పుడే నానాత్వం నశిస్తుంది. అయితే ఆ నారాయణుడు ఎక్కడో లేడు. హృదయంలోనే ఉన్నాడు. కానీ మనమంతా ఆయన కోసం బయట అన్ని చోట్లా వెతుకుతాం. దేహం అనే ఆవరణను తొలగించుకొని లోపల ప్రకాశిస్తున్న దివ్యమూర్తిని దర్శించ లేకుండా ఉన్నాము.

మృత్యువు అంటే భయంలేనివాడు లేడు. కాని మృత్యుంజయుడైన స్వామి మన హృదయ కుహరంలోనే ఉన్నాడు. ఇంకా ఎందుకు మనకు మృత్యు భయం?

-సశేషం

> భగవంతుణ్ణి కోరికలతో పూజించరాదు. సత్ఫలితాలు కోరువారు నిష్కామంగానే ధ్యానించాలి. - కాళీబాబు

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

శ్రీ దత్తస్వామి జన్మదినమని మనం ఎంతో ఉత్సాహంగా, భక్తి శ్రద్ధలతో సత్సంగ సమావేశాలతో సహా వేడుక చేసుకుంటున్నాం. జననము, మరణము లేని వారి గురించి మనం పుట్టినరోజు పండగ అని చెప్పి ఉత్సవం చేసుకుంటున్నాము. ఇది చాలా విచిత్రంగా ఉంది కదూ? మహాత్ముడైన దత్తస్వామికి పుట్టుక అనేది లేదు. కానీ వారి యొక్క "ఆవిర్భావాన్ని" మనం సంతోషంగా పండుగ చేసుకుంటున్నాము. ఇంగ్లీషు వాళ్ళు పుట్టినరోజు నాడు Happy Birthday To You (హ్యాపీ బర్త్‌డే టు యూ) అని పాడుకుంటూ, ఒక కేకు మీద పెట్టిన వెలుగుతున్న కొవ్వొత్తులని ఉఫ్‌మని ఊది ఆర్పేసాక, ఆ కేకుని కత్తి పెట్టి కోసి అందరూ తింటారు.



"ఒరేయ్! నీ జీవితంలో ఇన్ని ఏళ్ళు గడిచిపోయాయి. నీలోని ఆయుష్షు అనే దీపం ఆరిపోతోంది. నీ జీవితం కూడా కత్తితో కోయబడుతోంది" అని అంటున్నట్టుగా లేదూ ఈ తతంగమంతా?

కానీ, మహాత్ముల 'ఆవిర్భావం' అలాకాదు. ఆవిరనేది మనకి కనిపించదు. అది అంతటా వ్యాపించి వుంటుంది. ఆవిరిని చల్లబరిస్తే నీరవుతుంది. నీటిని మరింత చల్లబరిస్తే 'ఐసు'గా మారి ఒక రూపం వస్తుంది. అదేవిధంగా సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, సర్వశక్తి మంతుడు, రూప నామ క్రియా రహితుడు అయిన (ఆవిరి రూపంగా ఉన్న) పరమాత్మ, భక్త జనులనుద్ధరించడానికి ఒక రూపాన్ని దాల్చి ఈ భూమిపై మహాత్ముల రూపంలో అవతరిస్తాడు. దీనిని 'ఆవిర్భావం' అంటారు. ఆవిరి ఘనీభవించిన్నదన్నమాట. కనుక మహాత్ములకి మనలాగా పుట్టడం అనేది లేదు. పుట్టడం అనేది లేనప్పుడు ఇక మరణం అనేది ఎక్కడుంటుంది? ఒక ప్రణాళిక ననుసరించి, ఈ భూమిపై వారు అవిర్భవిస్తారు. వారి అవతార ప్రయోజనం నెరవేరింది అని అనుకున్నప్పుడు తమ అవతారాన్ని

ఉపసంహరించుకుంటారు. వారి రూపం మనకి కనబడటం లేదుకాని, వారెల్లప్పుడూ 'ఆవిరి' రూపంలో అంతటా నిండియే వున్నారు.

మహాత్ములు ఏదేశంలోనైనా అవతరించవచ్చు. భగవంతుడి దగ్గర 'వేరుతనం'లేదు. జాతి, నీతి, కుల, గోత్రాలు లేవు. ఈ దేశం, ఆ దేశం, ఈ భాష, ఆ భాష అనేవి లేవు. అజ్ఞానాంధకారంలో కొట్టు మిట్టాడుతున్న మానవాళిని మేలుకొలిపి, వారి హృదయాలని జ్ఞాన భాస్కర కిరణాలతో నింపి ఆనంద స్వరూపులుగా తీర్చిదిద్దడమే సత్య గురువుల ధ్యేయం.

అటువంటి సద్గురు తత్వం (భగవత్తత్వం) మధురాతి మధురమైనది. పంచదార చిలుకని ఎటునుంచి కొరికినా తీపే. అదేవిధంగా మహాత్ముల తత్వం ఎటునుంచి జుర్రినా ఆనందమే. సద్గురునాధులకి, భగవంతుడికీ విడదీయడానికి లేదు. '**అప్రత్యక్షో మహాదేవః। సర్వేషాం ఆత్మ మాయయా। ప్రత్యక్షో గురురూపేణ। వర్తతే భక్తి సిద్ధయే**'' అన్నారు. మనకి కనిపించకుండా అప్రత్యక్షంగా ఏ మహాదేవుడయితే వున్నాడో, ఎవరయితే సర్వత్రా నిండివున్న ఆత్మ స్వరూపుడై వున్నాడో, ఆయనే తనమాయని అధిష్టించి, గురురూపంలో మనముందుకి ప్రత్యక్షంగా వచ్చి, మనభక్తిని సిద్ధింపచేస్తున్నారు.

ఇటువంటి పరిపూర్ణ తత్వాన్ని గుర్తించి ఆనందంలో ఓలలాడాలి గాని, అనవసరమైన ఏడుపులతో జీవితాన్ని వ్యర్థం చేసుకోకూడదు. 'నేను ఫలానా' అనేదే చావాలి సాధనలో. ఇదే బ్రతికుండగానే చావడం అంటే. 'దేహం నేను' అనే దేహాత్మ భావన చావాలి. ఇదే 'జీవన్ముక్తి'. రాధ, గోపికలు, ఉద్ధవుడు, అక్రూరుడు ఇత్యాది భక్తులు యీ విధంగా బ్రతికుండగానే చచ్చిన మహాత్ములు. శరీర దృష్టి పోతేనే గాని, నిజమైన ఆనందాన్ని పొందలేరు. "దేహ వాసన వదలిన - **ఘన దివ్య దృష్టియె రామనామము**'' - అన్నారు కదా అని, ప్రతిరోజూ, "నేను దేహం కాదు - నేను దేహంకాదు'' అని కొన్ని లక్షల సార్లు జపం చేయవచ్చు. కానీ ఎవరేనా వచ్చి తన మీద ఉమ్ము వేసే సరికి, "ఏంరా! రోజూ 'నేను దేహంకాదు - నేను దేహంకాదు' అని లక్షలసార్లు జపం చేసే జ్ఞానిని! నాపై ఉమ్మేస్తావటరా?'' అని మీదపడతాడు. ఇది Practical (అనుభవ) జ్ఞానం కాదు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

13-6-1985

ఈ రోజు ఉదయం శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అమెరికా వెళ్ళి వచ్చినవారు న్యూయార్క్‌లో భవనాలు ఆకాశాన్ని అంటి ఎత్తుగా ఉంటాయి అనగానే అయ్యో! అంత బాగుంటాయా! అని ఆశ్చర్యాన్ని ప్రకటించి మనం చూడలేకపోయామే అని బాధ పడతారు. కాని ఆప్రకృతికి సౌందర్యాన్నిచ్చే జగజ్జనని ఇచ్చే ఆనందం వర్ణశక్యం కానిది అని ఎంత చెబితే మాత్రం ఆ జగజ్జనని ఎలాగైనా దర్శించాలనే ఆవేదన చెందుతారా మానవులు? ఏమంటారు రావుగారు? అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మధురరసం ఆనందాన్నిస్తుంది గాని, ముషిడిరసం ఏం ఆనందాన్ని ఇవ్వగలుగుతుంది? కాని ముషిడిరసం చేదు అని తెలిసినా కూడా దానినే స్వీకరిస్తాడు. అదే ఆనందంగా ఉందని భ్రమిస్తాడు గాని నిజమైన ఆనందాన్ని పొందటానికి ప్రయత్నించడు. మానవుడికి మానవుడికి మధ్య అహంకారం నిలబడుతుంది. అహంకారముతో కూడి ఉన్న మానవుడు రాక్షస రూపం కలిగి ఉండి క్రోధావేశములో సత్యాసత్య వివేకమును కోల్పోయి పంచాయితీ దున్నపోతు కన్న హీనంగా ఉంటాడు. ఎఱ రుచికి అలవాటు పడిన చేప గాలానికి చిక్కుకుంటుంది. ప్రాపంచిక వాసనలకి అలవాటుపడిన మానవుడు కూడా ప్రకృతి సౌందర్యానికి దాసుడు అవుతాడు. దుఃఖాన్ని పొందుతాడు. ఎక్కువ తింటే అరగదు. పడుకోవాలంటే నిద్ర పట్టదు. మరి శాంతిని ఎలా పొందగలుగుతాడు?

సత్యగురువుని ఆశ్రయించాలి. గురువుని ఆశ్రయించినంత మాత్రాన చాలదు. గురువుని బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపంగా భావన చేయాలి. గురువుని మానవుడిగా ఎప్పుడు చూస్తావో అప్పుడు మానవత్వాన్ని దాటలేవు. నీలోని నీచ భావనే మాయాశక్తి. అది గురుతత్వాన్ని తెలుసుకో నివ్వదు. గురుతత్వాన్ని తెలుసుకోలేనివాడివి ఆత్మతత్వాన్ని ఏం తెలుసుకో గలుగుతావు? గురుతత్వము, ఆత్మతత్వము ఒక్కటే.

దీపము నుండి దీపకాంతిని విడదీయగలవా? సూర్యకిరణము నుండి సూర్యకాంతిని విడదీయగలవా? అలానే గురుకాంతికి ఆత్మతేజస్సుకు తేడా

లేదు. అటువంటి సత్యగురువు సదాశివ బ్రహ్మేంద్రులవారు. ఆయన భక్తిపారవశ్యంతో సంకీర్తన చేస్తూ ఒక మహారాజు నవాబు గుడారంలో నుంచి వెడుతుండగా ఆ నవాబు ఆయన హస్తాన్ని ఖండించారు. తన హస్తం క్రింద పడిపోయినా దేహస్మృతి లేకుండా అలాగే సంకీర్తన చేసుకుంటూ వెళ్ళిపోయారు. అంతట ఆ నవాబు నాకు యుద్ధంలో చిన్న దెబ్బ తలిగిలితేనే బాధపడేవాడినే మరి ఈయన ఇంత ఆనందంగా, శాంతిగా నృత్యం చేస్తూ వెళ్ళిపోతున్నాడే అన్న ఆలోచన కలిగింది.

ఆ నవాబు సంస్కారం బయటపడింది. క్రిందపడి ఉన్న ఆ హస్తాన్ని తీసికొని సదాశివ బ్రహ్మేంద్రులవారి నెంట వెళ్ళాడు. ఆయన దివ్య చరణార విందాలను పట్టుకొని క్షమించమని ప్రార్థించాడు. భక్తుడు గొప్పవాడా? భగవంతుడు గొప్పవాడా? ద్వారకీవాసుడు ఉదయం నిద్రలేవగానే మీలాగా బెడ్‌కాఫీ తీసుకునేవాడు కాదు. ఎవరూ చూడకుండా రహస్యంగా దాచబడిన భక్తుల పాదధూళిని తన శిరస్సుపై హే పరమేశ్వరా! అంటూ ఉంచుకొనేవాడు. ఫ్యానులోనిది, లైటులోనిది శక్తి ఒకటే కదా! దీనిని తెలిసికోలేకపోవటమే అజ్ఞానము. సత్యగురువులు ఎంత చెప్పినా వినరు. గారడి విద్యలు మనష్యులను ఆకర్షించినంతగా సత్యగురువుల మాటలు రుచికరించవు.

రాజమండ్రిలో వరదరాజు హోటలు ఎదురుగా ఇంద్రజాలము చేసి రూపాయలు తెప్పించేవారు. చాలమంది జనం చేరి ఆ ప్రదర్శన చూసేవారు. చివరకి ఆ ప్రదర్శన చేసినవాడు అందరినీ డబ్బులు అడిగేవాడు. అటువంటి గారడి విద్యలు చేసేవారు భగవంతుని చేరే మార్గం ఏం చెప్పగలుగుతారు? నా జేబులో రూపాయి ఉంటే నీకు ఇవ్వగలనుగాని, నా జేబులోనే రూపాయి లేకపోతే నీకు నేను ఏమి ఇవ్వగలుగుతాను? తాను దూర కంత లేదుట, మెడకి ఒక డోలు కట్టుకున్నాడట. మోసం చేసి సంపాదించిన ధనం నిలవదు. వారికి దీర్ఘవ్యాధులు వచ్చి వారి ధనమంతా డాక్టర్లుకు చెల్లించాల్సి వస్తుంది. లోకంబులు, లోకేశులు, లోకస్థులను దాటి పెంజీకటి కావలనున్న కాంతిని దర్శించానన్నాడు పోతన. ఆ కాంతి ఎక్కడ ఉంది? ఎక్కడో లేదు. నీలోనే ఉంది. నీలో ఉన్న వాసనాత్రయము, అవస్థాత్రయము, ఈషణాత్రయము అనే త్రిపుటిని దాటితే జ్యోతిని దర్శించ గలుగుతావు అన్నారు శ్రీబాబు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**మార్చి 2012**

8 గురువారం పూర్ణిమ, హోలీ, శ్రీ సద్గురు పాదపూజ.

17 శనివారం శ్రీగురుదశమి, సత్సంగం , శ్రీసద్గురుపాదపూజ

20 మంగళవారం మాసశివరాత్రి

23 శుక్రవారం నందన నూతన సంవత్సరాది. పంచాంగ శ్రవణం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**24 శనివారం నుండి 30 శుక్రవారం వరకు** మౌనధ్యాన సాధన సప్తాహ శిబిరం తె.జా 3.15 నుంచి మొదలుఅవుతుంది.ఆసక్తి కలవారు ముందుగా సంప్రదించగలరు (ఫోన్ నెం.0863 -2293564)

**ఏప్రిల్**

**06** శుక్ర పౌర్ణమి. శ్రీసద్గురుపాదపూజ.

**15** ఆది గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**19** గురు మాసశివరాత్రి

**26** గురు శ్రీశంకరాచార్య జయంతి, శ్రీ సద్గురు సప్తదశ వార్షిక ప్రతిష్టా మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

### గర్భిణీ స్త్రీలకు శుభవార్త!

శ్రీశ్రీశ్రీ సమర్థ సద్గురు హనుమత్కాళీ వర ప్రసాదబాబూజీ ట్రస్ట్ హాస్పిటల్ శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో, సద్గురుదేవుల దివ్య ఆశీస్సులతో పూజ్యమాతాజీ **ఉచిత ప్రసూతి వైద్యసేవలను** అక్టోబర్ 2011 నుంచి అందిస్తున్నారు. ప్రసూతి పరీక్షలు, అవసరమైన మందులు, ఆపరేషన్ ఖర్చులు, సాధారణ డెలివరీ ఖర్చులు మొ॥గు సర్వవిధమైన ఖర్చులను ఉచితంగా అందించి, తల్లీ బిడ్డ క్షేమంగా యింటికి తరలించేవరకు ట్రస్టు ఆసుపత్రివారే భరిస్తారు. ఇంతవరకు 8 సిజేరియన్ ఆపరేషన్లు, 46 సాధారణ ప్రసవములు ఉచితంగా జరిపించారు. బయట ఎంతో వ్యయంతో కూడుకుని ఉన్న ఈ కార్యక్రమాన్ని ఎంతో దయతో మనకు ట్రస్ట్ హాస్పిటల్ వారు ఉచితంగా అందిస్తున్నారు. కాబట్టి ఈ సదావకాశాన్ని గర్భిణీస్త్రీలు ఉపయోగించుకో వలసినదిగా తెలియ జేస్తున్నాము.

దయాహృదయులు, దానకర్ణులు యధాశక్తిగా తమ చేయూతను అందించి మాతాజీవారి యీ ఉచిత ప్రసూతి సేవాకార్యక్రమాన్ని, హితోధికంగా విరాళములిచ్చి సహకరించవలసినదిగా కోరుచున్నాము. - ట్రస్ట్ హాస్పిటల్

## అభయం సర్వభూతేభ్యో దదామి

- ఆర్.టి.సి. లక్ష్మి

శ్రీకృష్ణుడు కాళీయుని మదమణిచే పదఘట్టనతో వీర విహారం చేసి, కాళీయుని భార్యలతోనే ప్రార్థింపబడి శాంతుడైనాడు. కాళీయుని క్షమించవలసినదిగా నాగాంగనలు శ్రీకృష్ణునితో ' ప్రభూ! క్రూరులను దండించుటకే నీవు భూమిపై అవతరించావు. ఈ దురాత్ములను అణచుట జగత్తును రక్షించుటకే కదా! ఎటువంటి మహానుభావులకూ చేరువగాని నీవు యీ కాళీయుని తలలెక్కి నటించుట కేవలం అతని పూర్వపుణ్యమే. ఎటువంటి తపస్సు చేశాడో! ఎటువంటి సత్కర్మలు ఆచరించాడో! అటువంటి నీపాద ధూళిసోకినవారు ఎప్పుడూ కూడా ప్రపంచాధిపత్యాన్ని కూడా అంగీకరించరు. ప్రభూ! ఇప్పటికే ప్రాణావశిష్టుడై యున్నాడు. పడగలన్నీ నుగ్గునుగ్గుగా చితికిపోయాయి. నీ సృష్టిలోని ప్రాణులమైన మా స్వభావసిద్ధంగా వచ్చిన లక్షణాలు నీకు తెలియనివి కావు. మా ప్రవర్తన వక్రమమైనది. మా తలలో, జిహ్వలో విషం ఉంటుంది. ఈ కాళీయుడు ధూర్తుడైనా, దుర్మార్గుడైనా మా భర్త. మమ్మ అనాధలను చేయకు' అని ప్రార్థించారు.

తమ లోపాలు భగవంతుడి సృష్టి కారణంగా కలిగినవేనని భావిస్తూ, తలలోని ఆలచనలతో, మాటల యందు కుటిలత్వంతో ప్రవర్తిస్తూ, నెపం భగవంతుడిపై వేసి, బాధ్యత నుండి తప్పించుకుంటూ ఉంటాం. వక్ర ప్రవర్తన, వక్రభావన, వక్రభాష్యం వీటిని మనం మార్చుకొనే ప్రయత్నం చేయాలంటే ముందు మనలో లోపాలని మనం గుర్తించి బాధ్యత తీసుకోవాలి.

ఇదేవిధంగా తార లక్ష్మణునితో మాట్లాడే విధం గుర్తువస్తుంది. వాలి వధానంతరం కిష్కిందాధిపతియై, కర్తవ్యాన్ని మరచి, భోగలాలసుడైన సుగ్రీవుణ్ణి హెచ్చరించటానికి క్రోధ తామ్రాక్షుడై తీవ్ర వేగంతో ఆవేశపరుడై వస్తున్న లక్ష్మణుని చల్లబరచటానికి సుగ్రీవుడు తారతో "తారా! వచ్చిన లక్ష్మణుడు కోమల హృదయుడు. స్త్రీలను క్రోధ దృష్టితో చూడడు. నువ్వు ముందుగా వెళ్ళి ఆయన్ని ప్రసన్నుడను చెయ్యి" అనగా తార వస్తుంది.

వస్తున్న తార ఎలా ఉంది? ఆమె కన్నులు మదవిహ్వలములై ఉన్నాయి. వడ్డాణం జారుతున్నది. అస్తవ్యస్తమైన హారాలతో, స్తనభారంతో, తడబడే అడుగులతో, మధుపానంతో లజ్జావిహీనయైన తారను చూసి లక్ష్మణుడు

కోపాన్ని అదుపుచేసుకుని, కన్నులు తిప్పుకుని తలవంచుకున్నాడు.

'ధర్మార్థసాధకులు మద్యానికి దూరంగా ఉంటారు. గుణవంతుడైన మిత్రునితో విరోధం సర్వనాశన హేతువు. రాముడు నీకు చేసిన ఉపకారాన్ని మరచి, గ్రామ్య సుఖాలలో ఆనందిస్తున్నావు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ మాట నువ్వు నిలబెట్టుకో లేదా వాలి వెళ్ళిన దారి ఉంది. నిన్నూ ఆ దారినే పంపవలసి ఉంటుంది. రాముడు ధనస్సు ఎక్కు పెట్టనంతవరకే ఈ భోగాలు' అని ఆగ్రహంతో పలుకుతున్న లక్ష్మణునితో తార - 'రఘువంశీయుడా! ఎందుకంత కఠోరంగా పలుకుతావు? ఆయిన వానరేశ్వరుడు. ప్రభువు. ఆయన్ను అంతలేసి మాటలు అనవచ్చునా? ఆయన కృతఘ్నుడు, నీచుడు కాదు. కపట ప్రవర్తన, అసత్య భాషణ ఆయన ఎరగడు. రామచంద్రుని దయవలననే రాజ్యము, రుమ, నేను ఆయనకు లభించినవి అని ఆయన మరువడు. మేనకా సంయోగంతో విశ్వామిత్ర మహర్షి కాలజ్ఞానం కోల్పోలేదా? సుగ్రీవుడి అభిప్రాయం తెలుసుకోకుండా క్రోధవశుడవు కావటం ఉచితమా? సత్వగుణ సంపన్నులని పేరు పొందిన ఇక్ష్వాకు వంశంలో పుట్టిన నువ్వు పూర్వాపరాలు విచారించకుండా మాట్లాడతావా? అవసరమైతే యీ సుగ్రీవుడు వానరరాజ్యాన్ని, రుమను, నన్నూ కూడా వదులుకోగలడు. రావణుని పరివారంలో ఎందరో కామరూపులైన రాక్షసులు ఉన్నారు. వారిని సంహరించటానికి మీకూ మా సహాయం అవసరం. వాలికి రావణుని గురించిన సర్వ విషయాలూ తెలుసు. నాతో చెబుతూ ఉండేవాడు. నువ్వు గ్రహించలేదు కానీ, అప్పుడే దిశాంతాల నుండి వానర సేనాపతులు ససైన్యంగా సుగ్రీవాజ్ఞతో వచ్చి చేరారు. ఈ సాయంత్రానికి మిగిలిన వారందరూ కిష్కింధకు చేరతారు. వాలి వధతో చెదరిన గుండెలింకా సర్దుకోలేదు మా అంతఃపుర జనానికి. మళ్ళీ యిప్పుడు నువ్వు మమ్మల్ని భయకంపితులను చేయకు' అని మధురంగా మాట్లడగా లక్ష్మణుడు శాంతించాడు.

భోగలాలసుడు, కొత్తగా రాజ్యపదవి రానటం, సహజమైన వానర ప్రవృత్తినీ అంగీకరిస్తూ - 'మా సహాయం కూడా మీకు అవసరం' అనే హెచ్చరికా, విశ్వామిత్రాది ఋషులూ ప్రలోభ పడేటంతటి వివశత్వమూ, అంతటి మత్తులోనూ మాట్లాడగలిగింది తార! మిత్రుని పొరబాటును క్షమించమంటూనే వాలి మరణాన్ని యింకా మరవలేదని ఎత్తిపొడుస్తోంది. ఇక్ష్వాకు వంశస్థుల సత్వగుణాన్ని మెచ్చుకుంటూనే, పూర్వాపరాలు

విచారించకుండా మాట్లాడుతున్నావు అంటోంది. మిత్రధర్మాన్ని విన్నవిస్తూనే, వారికి రాక్షసుల కామరూపాలు తెలుసుకోవటానికి తమ అవసరం ఉందని హెచ్చరించింది.

వాలితో సుగ్రీవుడు వెంటనే తిరిగి యుద్ధానికి రావటం వెనుక బలమైన కారణం ఉండివుంటుందనీ, యిద్దరు రాచకుమారులతో సుగ్రీవుడు మైత్రి చేసుకున్నాడని వార్త వినవచ్చిందనీ, పూర్వాపరాలు ఆలోచించి మరునాడు యుద్ధానికి సన్నధం కావలసిందిగా వాలికి యిచ్చిన సలహా, తార అత్యంత తెలివైనదనీ, ఆమె వ్యావహారిక దక్షతనీ నిరూపిస్తుంది.

నాగాంగనలు కూడా తమ నాధుని వక్ర చరితవ్యానికీ, విషాగ్ని జ్వాలలు గుమ్మరించి గోకులాన్ని చీకాకు పరచటానికీ భగవంతుని సృష్టి నియమం అనే నెపాన్ని పెట్టి తమ నాధుని దూరం చేసి తమను అనాధలను చేయవద్దనీ వేడుకుంటారు.

ఏది యేమైనా శ్రీనాధుని దివ్యచరణ శరణుడౌట జేసి **కాళీయుడూ**, శ్రీ రామభద్రుడు కరుణా సముద్రుడు గనుక తానే కార్యం సాధించుకోగలిగి ఉండి కూడా వానర సహాయన్ని పొంది, తన కార్యసాధనలో వానరులకూ ప్రముఖ స్థానాన్ని యిచ్చిన శ్రీరామచంద్రుని చరణార విందముల యందు అనన్య ప్రపత్తిని చాటుట వలన **సుగ్రీవుడూ** తమ తమ నెలవులు పొందారు!

## సర్వత్రా సమ బుద్ధి

ఒకడు తను నివసించే గదిలో ఒక అంగుళం కూడా వదలకుండా, పై కప్పు, నేల, గోడలకు అన్నీ అద్దాలు అమర్చుకున్నాడు. గది మధ్యగా నిలబడి దీపం వెలిగించి తలుపు మూశాడు. క్రిందా, పైనా, ప్రక్కలా ఎక్కడ చూచినా తన ప్రతిబింబమే కనిపించింది. తనని తను చూచుకుని ఎంతో ఆనందించాడు. అలా సరదా తీర్చుకుని గది తలుపు వేయటం మరచిపోయి బయటకి వచ్చేశాడు. కొంతసేపటికి అతని కుక్క ఆ గదిలోకి వెళ్ళింది. అద్దాల్లో ఎక్కడ చూచినా తన ప్రతిబింబమే చూచింది. అవన్నీ తన శత్రువులు అనుకొని వాటి మీద మొరిగి మొరిగి చచ్చిపోయింది.

మానవుడు తన తోటి వాళ్ళు తన కన్నా వేరే అనుకుని శత్రుత్వం వహించుతాడు. ఇరువురికీ భేదం లేదని గ్రహించగానే శత్రుత్వం మరచిపోయి వారిని ప్రేమించుతాడు.

# గురు కృపాహి కేవలమ్

సేకరణ-రమణ ప్రసాద్

గురువు యొక్క ప్రేమ అపారము, అనంతము. అది సదా తమ శిష్యులపైన వర్షిస్తూనే ఉంటుంది. అది గుర్తించినవానికి ఆనందం లభ్యమవుతుంది. చూడండి! తల్లి దండ్రులు తమ పిల్లలపై ఎంత వాత్సల్యం చూపిస్తారో మనకు తెలిసినదే కదా! " పరమాత్ముడు తన సంతతియైన మనపై అంతకంటె ఎక్కువ వాత్సల్యం చూపిస్తాడు అనటంలో సందేహంలేదు. ఈ జగత్తులోని జీవులు అంతా వారి సంతతియే కదా! అయితే జీవులు భగవంతుని యందు విశ్వాసం కలిగి ఉండిన ఎడల వారు భగవంతుని కృపకు పాత్రులు అవుతారు'' అని బోధ చేశారు శ్రీ బాబు.

ఒక భక్తుడు "బాబూ! భగవంతునికి మన ఉనికి తెలియజేస్తేనే కదా ఆయన కృపకు పాత్రులమయ్యేది. మరి మన ఉనికిని ఆయనకు ఎలా తెలియచేయటం?'' అని ప్రశ్నించారు.

శ్రీబాబు బోధ చేస్తూ " మనస్సు పాదరసం వంటిది. అది నిశ్చలత్వాన్ని పొందటం చాలా కష్టం. అనుభవజ్ఞులైన గురుదేవులను ఆశ్రయించినవారు తప్పక గురుకృపకు పాత్రులవుతారు. గురుదేవునికి, భగవంతునికి తేడా లేదు. గురుదేవులను ఆశ్రయించిన ఎడల వారు సక్రమమైన మార్గంలో నడిపించి మనలను తరింపచేస్తారు. మనం భగవంతునియందు మనస్సును ఉంచి భగవన్నామాన్ని అనవరతంగా స్మరిస్తూ ఉంటే, మన మనస్సు భగవంతుని రూపంలోనూ, నామంలోనూ లయించి మనస్సు నిశ్చలత్వాన్ని పొందుతుంది.'' అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ" మహాత్ములు అద్భుతాలు చేయటం భక్తులకు విశ్వాసాన్ని కలిగించటానికి మాత్రమే. వారికి కీర్తి వ్యామోహం ఉండదు. అయిచే చేతిలో రూపాయి, చెవిలో మంత్రం కోవకు చెందిన గురువులు కొంతమంది వ్యాయామ ప్రదర్శనలు, గారడి విద్యలు ప్రదర్శిస్తారు. కాని దానివలన ఏం ప్రయోజనం? అది తరించటానికి ఉపయోగ పడుతుందా? ఒక గుడ్డివాడు ఇంకొక గుడ్డివాడి చెయ్యి పట్టుకుంటే ఏమవుతుంది? గుడ్డివాడు గోతిలో పడగానే వాడి చెయ్యి పట్టుకున్నవాడు అదే గోతిలో పడతాడు'' అన్నారు.

శ్రీబాబూజీకి మహత్తులను ప్రదర్శించటం అన్నా, లేదా వాటిని గురించి ప్రచారంచేయటం అన్నా ఇష్టం ఉండేదికాదు. అందువలననే వారి శిష్యులు ఆయనను గురించి చెప్పడానికి భయపడేవారు.

శ్రీబాబు ఈ విషయంపై మాట్లాడుతూ " వీడు కూడా ఏవో మహత్తులు ప్రదర్శించాడేమో'' అన్నారు.

అమెరికా పర్యటన ముగించుకొని తిరిగి వచ్చేందుకు ముందుగా టిక్కెట్లు కొనటం జరుగలేదు. దేవీ నవరాత్రి మహోత్సవాలు వచ్చేశాయి. శ్రీబాబు తప్పనిసరిగా స్వదేశానికి వెళ్ళిపోవాలి అన్నారు. కాని టిక్కెట్లు లభించలేదు. ఆయన శిష్యులంతా చాలా ప్రయత్నాలు చేశారు. కాని ఫలితం శూన్యం. శ్రీబాబు స్వదేశానికి తిరుగు ప్రయాణం చేసే రోజు రానే వచ్చింది.

శ్రీబాబు ఒక శిష్యుణ్ణి పిలిచి విమానాశ్రయానికి ప్రయాణ సన్నాహానికి ఏర్పాట్లు చేయమన్నారు. టిక్కెట్లు దొరకని కారణంగా శిష్యులంతా ప్రయాణం ఎలా జరుగుతుందా? అనే ఆందోళనతో ఉన్నారు.

శ్రీబాబు ఆజ్ఞమేరకు లగేజీ సద్దుకొని శ్రీబాబు, వారితోపాటు వారి శిష్యులంతా విమానాశ్రయానికి వెళ్ళారు. వారంతా అక్కడికి చేరేసరికి , భారతదేశానికి లండన్‌మీదుగా పోయే విమానం బయల్దేరటానికి సిద్ధంగా ఉంది. విమానాశ్రయంవారు అప్పుడే శ్రీబాబునీ, శ్రీనారాయణగారివెంటనే చెక్కింగ్ కౌంటర్ దగ్గర రిపోర్ట్ చెయమని ప్రకటించారు.

శ్రీబాబుకీ, శ్రీనారాయణగార్లకు ఇదివరలోనే రెండు టిక్కెట్లు రిజర్వు చేయబడి ఉన్నాయి. ఇది ఎలా జరిగింద? ఎవరు చేశారు?

శ్రీబాబు మాట్లాడుతూ" ఎవరో మన శిష్యులు కొని ఉంటారేమో టిక్కెట్లు''అన్నారు."అబ్బే! మీకేమీ తెలియదు పాపం'' అన్నారు శ్రీ వెంకటరత్నంగారు(శ్రీబాబు భక్తులు).

శ్రీ బాబు డాక్టర్ రామచంద్రరాజుని ఉద్దేశించి " చెప్పవయ్యా! వెంకట్రాజుగారి సంగతి'' అని, శ్రీబాబు వారి గురించి ఇంకా ఇలా చెప్పారు "భక్తులు వారి వారి సంస్కారాలనుబట్టి చక్కని అనుభూతులను పొందుతారు. డాక్టర్ వెంకట్రాజుగారు మంచి భక్తులు. ఆయన ఎప్పుడూ ఆధ్యాత్మ చింతననే కోరేవారు'' అన్నారు

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

-సుశీలా ప్రసాద

(గతసంచిక తరువాయి)

ఒక చేత్తో ముఖం మీద పడుతున్న ముంగురలను చేతికున్న మురుగులు గల్లుమనేట్లు సవరించుకుంటూ, మరొక చేతితో జారిపోతున్న కట్టుకున్న పంచెను పట్టుకుంటూ తలమీద నెమలి పురి అలంకరించి ఉండగా, కూర్చున్న చోటులోనుంచి పైకి లేవబోతున్న భంగిమలో ఉన్న ఆ దివ్య మంగళ మూర్తిని లేవనీయకుండా, కదలకుండా తన కరాలతో సుకుమారమైన ఆ పావన చరణ కమలాలలను బంధించివేసింది.

మెల్లిగా కూర్చుండిపోయిన ఆ మోహనాకారుడు ఆమెను చూస్తూ వెన్నెల కన్నా, వెన్నకన్నా చల్లనైన మెత్తనైన చిరునవ్వులు చిందించాడు. తన వంకే చూస్తూ చూపులో చూపునిలిపి ఉన్న విరజ తలపైన గాలికి రాలిన పారిజాతాన్ని తన సుందర హస్తంతో లేపే నెపంతో ఆమె తలను తాకగానే ఆ స్పర్శాతో విరజ తనువు నిండా కోటికోటి మెరుపులు మెరిశాయి. మైమరచిన విరజ కనుల వెనుక అస్పష్టంగా గోచరిస్తున్నదా దృశ్యం! అది.........అది................ “గుర్తు వస్తున్నదా?'' అన్నాడు లీలాకిశోరుడు. అంతే............

అతి చక్కని ఆశ్రమ ప్రాంతం. రవ్వంత సవ్వడి కూడా వినరాని పరమ ప్రశాంత వాతావరణంలో......... సద్గురుమూర్తి ఎదుట అతి వినమ్రుడై, అంజలి బద్ధుడై ఉన్న శిష్యపరమాణువు. ఇరువురూ దివ్యమైన స్థితిలో ఉన్నారు. శ్రీగురుదేవుల పవిత్ర హస్తం శిష్యుని మస్తకంపైన ఉన్నది. హస్తమస్తక సంయోగంతో శ్రీగురునాధుని ఆదేశాలను శిష్యుడు అందుకుని ఆచరణలో పెడుతున్నాడు.

“నేను నీకిచ్చిన లక్ష్యార్థా సాధనతో నిత్యానిత్య వివేకం కలిగి, **ప్రజ్ఞానం బ్రహ్మ** అనే మహావాక్యోపదేశంతో నీ దేహంలోని సర్వేంద్రియాలను ప్రకాశింప జేసే ప్రజ్ఞ ఉన్నదని తెలుసుకున్నావు. ఆ ప్రజ్ఞానం బ్రహ్మవు నీవేనని తెలిపే సూచన మంత్రమే సోऽహం. సాధన ద్వారా సోऽహం అనేది మూలాధారం నుంచి సహస్రారం వరకు సంచరించే గొప్ప తేజస్సు అని గ్రహించావు. ఆ తేజస్సే గురుకాంతి. గురుశక్తి చైతన్యము. అదే తేజస్సు సర్వవ్యాప్తమై సర్వజగత్తుకు ఆధారమైన చైతన్యము. అదే సోऽహం. అదే నేను

అనే ఆత్మ తేజస్సు. నామరూప క్రియా రహితమైన ఆత్మ తేజస్సును జగత్తును దాటి దర్శించ గలిగే నీవు హంసవు.'' బ్రహ్మోపదేశాన్నిస్తున్న గురుదేవుల అమృతవాణిని వింటూ దేహభావన దాటి శిష్యుడున్న ఆ అపూర్వ తరుణంలో.......

గురుమూర్తి వీనులకి కాస్తంత సవ్వడి వినవచ్చింది. వారి దివ్యదృష్టికి గోచరించినదొక మూర్తి! "మన్నించండి స్వామీ! ఈ క్షణమందే ఈ జీవుడి ఆయుర్ధాయం ముగిసింది. నా పని నిర్వర్తించేందుకు మీ అనుమతి కోరుతున్నాను'' కాలుని కంఠస్వరం కటువుగా వినవచ్చింది.

"విధి దాటరానిది. నీ కర్తవ్యాన్ని నెరవేర్చుకో!'' గురుదేవుని వాక్కులలలో ఆర్ధ్రత మిళితమైంది. శిష్యుని తలపైన చేతిని తొలగించారు. వానికది అర్ధం కాని స్థితి. అయోమయంలో కాలునితో కాలు కదిపి జీవం లేచిపోయింది.

మురళీధరుని మధుర వాక్కులు వింటూ విరజ మనస్సు మేలుకొంటోంది. "స్వామీ! అనే పలుకు ఆమె నోటినుంచి వెలువడింది. "ఔను! ఆ గురు స్వరూపం నేనే. నాటి నీ ప్రయాణాన్ని ఆపే శక్తి నాకు పూర్తిగా ఉంది. కానీ ఆపలేదు. ఎందుకంటే ఆనాటి నీ సాధనా ఫలితాన్ని అనుభవించి మోక్షం పొదగల మహదవకాశం యీ నా అవతార సమయంలో స్వయంగా నీకు చేకూర్చేందుకు సంకల్పించాను గనుక. ఈ సకల సృష్టి నా వల్లనే కలిగింది. నాలోనే నిలిచి నాలోనే లయించిపోతుంది. మోక్షదాతను నేనే.''

తిరిగి విరజ పెదవులు కదిలాయి. "ఇంతకాలం నేనున్న నా స్థితిని..'' అక్కడే అందుకున్నాడు గోకుల నాధుడు "ఒక్క క్షణంలో నీ పూర్వజన్మ దివ్యానుభవం నీ మెదడులో మెరపులాగ మెరసి అంతలో మాయమవుతూ వచ్చింది. ఆ సమయంలో నువ్వు "నా గురుదైవమే తిరిగి నన్నుద్ధరించటానికి తానే స్వయంగా రావాలి. ఇంకే విధమైన ఉపాయమూ లేదు. నేనేమి చేయగలను'' అనే అనన్య శరణ్యత్వమే నీలో ఉండి ఏ విధమైన ప్రయత్నాలూ చేయక లోక వ్యవహారాలలో కూడా జడ స్వరూపమై ఉండి పోయావు. నీ బలమైన విశ్వాసమూ, గత జన్మలోని నీ సాధనా నీకు నా అనుగ్రహాన్ని కలిగించాయి. సాధకునికి ఒక జన్మలో ఏదైనా ఆటంకం కలిగినా, మరుజన్మలో వాని సాధన పూర్తిగాగలదనే పరమ సత్యాన్ని నీతో నిరూపిస్తున్నాను.'' విరజకి ఇప్పుడంతా బోధ పడుతోంది. చుట్టూ చూసింది. తనలో వెలుపల అంతా వెలుగే. అదంతనూ వెలిగిస్తున్న అఖండ తేజోమూర్తియైన జగన్నాధుడు ఇంకా ఇలాగ పలుకుతున్నాడు "నా అంతరంగ భక్తులైన గోపికలందరి జీవన రహస్యం

నాలోనే యిమిడి ఉంది. నాతోనే ముడిపడి ఉంది. ఇక నువ్వు వారిదారిలో నడుచుకో! నాలో చేరిపో!''

"అవ్యక్త మధుర ధ్వనిగల మరుగులు గలదియు, చేత పట్టుకోబడిన పట్టుబట్ట గలదియు, చక్కగానొత్తబడిన తల వెంట్రుకలు కలదియు, అమర్చబడిన నెమలి పురియను అలంకారము కలదియు, మరల పైకి లేవ నుంకించుచున్నదియు, ప్రియురాలి బాహువుల చేత పెనచబడిన శ్రీకృష్ణుని యొక్క ఏకాత శయ్యనుండి లేచుట నా యొక్క చిత్తమున ప్రకాశించుగాక!

### సజ్జన సాంగత్యం

ఒకసారి సముద్రంలో ఓ పెద్ద పడవకి చిల్లిపడి మునిగిపోయింది. ఆ సమయంలో ఒడ్డున ఉన్న యోగానందుడనే సన్యాసితో అతని శిష్యులలో ఒకడు "స్వామీ! వారంతా అలా ఎందుకు మరణించినట్లు?'' అని ప్రశ్నించాడు."వారు పాపాత్ములు కాబట్టి భగవంతుడు వారిని అట్లా శిక్షించాడు'' అని బదులు చెప్పాడు యోగానందుడు.

"మరి పుణ్యాత్ములు కూడా వారిలో కొందరుండి ఉంటారు కదా! ఆ అమాయకుల్ని ఎందుకు శిక్షించినట్లు?'' అని అడిగాడు శిష్యుడు. "వారు పాపాత్ములతో కలిసి ఉండటమే వారి నేరం'' అని యోగానందుడు జవాబు చెప్పాడు.

అందుకు శిష్యుడు ఆగ్రహంతో "ఆ భగవంతుడు అమాయకులని శిక్షించడం నేరం'' అన్నాడు. యోగానందుడు నవ్వి ఊరుకున్నాడు.

మరునాడు వారొక అడవిలో విశ్రమించినప్పుడు, చీమల పుట్టలో నుంచి కొన్ని చీమలు ఆ శిష్యుడి కాలిమీదకు పాకి కుట్టాయి. ఆ శిష్యుడు కోపంగా వాటిని నలిపి చంపేశాడు. "ఏం నాయనా నీవు చంపిన చీమలన్నీ నిన్ను నిజంగా కుట్టాయా?'' అని యోగానందుడు అడిగాడు. ఆ శిష్యుడు "అబ్బే అన్నీ కుట్టి ఉండవు'' అని బదులు పల్కాడు.

యోగానందుడు చిరునవ్వు నవ్వి "మరయితే అమాయకమైన వాటిని కూడా చంపేశావే? భగవంతుడి న్యాయాన్ని విమర్శించిన నీవు చేసినదేమిటి?'' అని అడిగాడు.

అప్పుడు శిష్యుడికి దుష్టులతో చేరిన అమాయకులు కూడా శిక్ష అనుభవించడం సబబే అనిపించింది. *

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

"మానవులు కొందరు భగవంతుడున్నాడనీ, కొందరు లేడని తమలో తాము వాదించుకుంటూ పోట్లాడుకుంటారు. భగవంతుడు లేడని వాదించేవారిని ఏమంటారండీ?" అని శ్రీసద్గురుదేవులు ప్రశ్నించారు. ఒక భక్తుడు సమాధానం చెబుతూ 'హేతువాదులు' అంటారు బాబు అన్నారు.

శ్రీసద్గురుదేవులు యింకా మాట్లాడుతూ "అయితే మీరంతా స్వచ్ఛందంగా ఆశ్రమవాసం చేయటానికి నిశ్చయించుకుని వచ్చారు కదా! మరి నాకు ఇది కావాలనో లేక మా పిల్లలకి ఏదో కావాలనో కోరుకుంటున్నారు కదా! దానిని ఏమంటారు మమకారమే కదా! కోరినవి లభించకపోతే దుఃఖమే కదా! అటువంటి స్థితిలో, భగవంతుడున్నాడని విశ్వసించే మీరు భగవంతుడు మాకు అన్యాయం చేశాడని అనకుండా ఉండగల్గుతారా! దీనిని ఏమంటారండీ? మీరే చెప్పండి!

భగవంతుడికి ఎవరికి, ఎప్పుడు, ఏది అందజేయాలో తెలియదా? ఆ విషయాన్ని చెప్పాననుకోండి. వెంటనే సమాధానం చెబుతారు ' మేము భక్తి విశ్వాసాలు ఉండబట్టే కదండీ ఆశ్రమవాసం చేస్తున్నాము' అని. అది అహంకార భావన కాదా! సద్గురుమూర్తికి నేను సన్నిహితుడిని నేనంటే నేనని మీరంతా వాదులాడుకోవటం లేదా! ఇది భక్తి అనిపించుకుంటుందా! సద్గురు మూర్తికి భక్తులంతా సమానమే కదా! ఒకరి యెందు యెక్కువ, ఒకరి యందు తక్కువ ప్రేమ చూపే భేద భావం ఉంటుందా?

దీనికంతటికీ కారణం మానవ స్వభావం. అహంకార, మమకారాలతో దేహ భావనతో కూడిన మనస్సు. అది కోతిలాంటిది. స్థిరంగా ఉండదు. చెట్టు కొమ్మలమీద గెంతే కోతిలాగ కదలికలతో కూడి ఉంటుంది. తన యింట ఒక అతిథిగా ఉండగలిగే భావనే నిజమైన వైరాగ్యం. ఆ స్థితి పొందిన వాడికి ఆ యింట ఏం జరిగినా బాధగాని, సుఖంగాని కలిగించదు కదా! మనస్సు నిర్మలంగా ఉంచుకోగలిగి, ఆశలేనివాడికి ఉన్నంత ప్రశాంతత ఎవరికి ఉంటుంది? అదే వైరాగ్యమంటే. ఎంతో బాధతో దుఃఖంతో దేనినో త్యాగం చేసినంత మాత్రాన మనస్సులో ఆ ముద్ర చెరగనప్పుడు అది వైరాగ్యమని అనిపించుకుంటుందా! పరిస్థితులు అనుకూలించక వైఫల్యం వలన కలిగే వైరాగ్యం అశాశ్వతం. మానవుడిలో వైవిధ్యమైన భావాలకు కారణం ఇటు అటు పరుగులిడే మనస్సే సుమా! నిలకడలేని మనస్సు పరిపూర్ణ విశ్వాసం భగవంతునియందు నిలుపని సాధకులు ఎంతటి ఆస్థికులైన ప్రయోజనం ఏమిటి?

*

(గతసంచిక తరువాయి)

# శివానందలహరి

-బులుసు మల్లిక్ U.S.A

గళంతీ శంభో త్వచ్చరిత సరితః కిల్బిష రజో
దళంతీ ధీకుల్యాసరణిషు పతంతీ విజయతామ్
దిశంతీ సంసార భ్రమణ పరితాపోశమనం
వసంతీ మచ్చేతో హ్రదభువి శివానందలహరి

ఈ స్తోత్రరాజంలోనే అతి ముఖ్యమైన శ్లోకమిది. ఎందుకో చూద్దాం. శంకరులు ముందస్తుగా శంభో! అని సంబోధిస్తున్నారు ఇక్కడ. అంటే అఖిల సుఖములను ప్రసాదించువాడా1. ఇక్కడ సుఖమంటే శాశ్వతమైనట్టిది. అది ఆత్మకు సంబంధించినది. అంతేకానీ ఇంద్రియపరమైనది ఎంతమాత్రమూ కాదు. విశేషమేమిటంటే శంకరులు ఒక మంచి రహస్యాన్ని బయటకు తెస్తున్నారిక్కడ. పరమానందానుభూతి ప్రస్తావన తెస్తూ యిలా అంటున్నారు శంకరులు.

***త్వచ్చరిత సరితః*** - నీ చరితము లేదా నీ కథ (అంటే శివ చరితము) అనేటటువంటిది ఒక స్వచ్ఛాందమాన నది. ఇప్పుడేదో దుఃఖం కలిగి అప్పుడి దాకా ఏడుస్తున్న పిల్లవానికి ఒక చిన్న నేతి మిఠాయి కనక పెడితే అది తింటూ ఆనందంలో వాడు ఎందుకు ఏడుస్తున్నాడో మరచిపోతాడు. ఒక నేతి మిఠాయే తాత్కాలికమైన దుఃఖాన్ని తక్షణమే పోగొట్టడం విచిత్రంగా లేదూ? దుఃఖానికీ దానికి సంబంధమేమైనా ఉందా? మరి మన కర్మఫలములో అవి తాత్కాలికాలు కావు. అందుచేత అవి దుఃఖభరితమైన జరామరణ వలయంలోకి మనల్ని నెట్టివేస్తున్నాయి. విశేషమేమిటంటే వాటి నుండి బయటకు పడలేకపోతూ వేరొక మార్గం తెలియక సతమతమౌతున్న మనబోటివారికి శంకరులు ఇస్తున్న నేతి మిఠాయి వీనులకు విందైన తియ్యని శివకథ అనే సులభోపాయం.

ఇక్కడ మరో విషయమేమిటంటే నవేతి అంటే న ఇతి అని ఊహించుకోవచ్చు. ఎందుచేతంటే యతోవాచో నివర్తంతే అని కదా ఉపనిషద్వాక్యము. వేదోపనిషదాదులు ఆ సత్య వస్తువుని చర్చిస్తూ ఇదికాదు, ఇది కాదు అని చెప్పియే కాని అక పదప్రయోగంతో ఆ వస్తువుని వర్ణించటానికి చేతకాక అక్షరమాలలోని వర్ణాలు వెనుకంజవేశాయట. అలాంటి శంకరులు మనకిక్కడ యిచ్చే ధీమా ఏమిటంటే పరమానందానుభూతి శివకథయనే నేతి

మిఠాయిలోని గుప్తసుధా స్వాదనం కన్నా భిన్నం కాదన్నదే. మరి ఆ నది ఎలాంటిదండీ?

గళంతీ - గలగల పారే నది. మన అంతరంగంలో నిబిడీకృతమైన పాపాలనే ధూళని పటాపంచలు చేసేవంటిది కావటం చేత కిల్బిష రజో దళంతీ - ఎలాగైతే నదీజలం బహిశ్శుచికి ఉపయోగపడుతుందో, అలాగే శివచరితామృతం అంతఃశ్శుచికి దోహదకరమౌతుందని గ్రహించాలి. ఈ నది ఎలా ప్రవహిస్తోందండీ?

ధీ కుల్యాసరణిషు పతంతీ - బుద్ధి యనే కాలువ ద్వారా ప్రవహిస్తోంది. అంటే శివకథలు విని వినీ అందులోనే తన్మయమైనవానికి తప్పకుండా ఈ అనుభూతి కల్గుతుంది. బెంగపడవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు. ఇప్పుడు బావిని త్రవ్వే ప్రయత్నం చేయండి. ముందేమి తెలియదు. కొంతసేపు అలా త్రవ్వాక నీరు పారటం ప్రారంభమౌతుంది. ఆ పిదప అంతా నిశ్చింతే. ఇలా జన్మాంతర కృత పాపాల నుంచి బయటపడే ఉపాయాన్ని అందిస్తూ సంసార భ్రమణ పరితాపోశమనం అయిందంటున్నారు శంకరులు.

కాకినాడలో నివసించే రోజుల్లో కుళాయిలో నీళ్ళు ఉదయం ఓ గంటా లేక రెండుగంటలు వచ్చేవి. మేమేం చేసే వాళ్ళమంటే బిందెలలోకి ఆ నీటిని ఓ రోజుకు సరిపడ్డంత పట్టి పెట్టుకునేవాళ్ళం. ముందస్తుగా ఆ బిందెని కడిగి పరిశుభ్రం చేయాలి కదా? ఆ కుళాయి నీటితోనే కడిగి, తరువాత ఆ నీటితోనే బిందెని నింపుకునేవాళ్ళం. అదే విధంగా.....

వసంతీ మచ్చేతో హ్రదభువి - అనడంలో ముందుగా ఏ ఆనందామృతం చేత శుద్ధిగావించబడ్డ చిత్తమే మరల ఆ ఆనందామృతాన్నే దాచుకొనే బిందెగా మారిందని ఉద్దేశ్యము. అది శాశ్వతంగా ఉండాలనే కాంక్షని ప్రకటిస్తూ..........

విజయతాం - అంటున్నారు. అదీ గురువుయొక్క కారుణ్యానికి తార్కాణం. ఇంతకీ మనం చర్చించుకున్న జలమే శివానందలహరి. శతకాలలో లాగ ప్రత్యేకమైన మకుటము లేకపోయినా ఈ స్తోత్రానికి పేరురావడం చేత, అలాగే శంకరులు చర్చించే విషయవస్తువు కూడా కావటం చేత ఈ శ్లోకం విశిష్టమైనది. ఆ శివానందానికి మనమందరమూ పాత్రులమవ్వాలని కాంక్షిద్దాం.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# సమర్థ సద్గురు

(యాజమాన్యం తదితర వివరాలు)

Form -4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.No 3-499 శ్రీకాళీగార్డెన్స్,నంబూరు R.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | -D.No 3-499 శ్రీ కాళీగార్డెన్స్,నంబూరు R.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ<br>ఛారిటబుల్ ట్రస్ట్<br>D.No 3-499 శ్రీకాళీగార్డెన్స్,నంబూరు R.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియ చేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 1.3.2012 పబ్లిషర్

## ఆధ్యాత్మిక దృక్పథంలో సామ్యవాదం

- జి.వి

(భీమవరంలో జరిగిన సత్సంగ సమావేశంలో శ్రీహనుమత్ కాళీ ప్రసాద బాబుగారి దివ్య ప్రసంగం)

దేవదేవుడైన శ్రీకృష్ణుణ్ణి మురళీనాధుడు అని అంటున్నారు. మానవాళి అంతరికీ అభయం యిచ్చే ఆయన మృదుల హస్తాన్ని వేణువు అలంకరిస్తూ ఉండేది. ఎంతో మధుర మంజుల గానం ఆ వేణువు నుండి వెలువడేది.

గోపికలు, ఋషులు, దేవతలు ఆయనతో క్షణం సేపు గడుపుదామని తహతహలాడుతుంటే, ఆయన మాత్రం అనేక రంధ్రాలుగల ఖాళీ వెదురుగొట్టంతో కాలక్షేపం చేయాలని తపన చెందుతూ ఉండేవాడు. ఎందుచేత? దీనికి కారణం కృష్ణునికి మానవాళిపై కరుణయే.

శ్రీకృష్ణుడు వేణుపై మ్రోగించే దివ్య ప్రణవ సంగీతం రేపల్లెలోని గోప గోపీజనాన్నే కాక, పశుపక్ష్యాదులు, సమస్త ప్రాణికోటిని పరవశింపజేసింది. క్రిమి కీటకాదులు కూడా ఆనందంలో మైమరచిపోయేవి.

ఆ సంగీతానికి అంతకన్న మించిన ప్రభావం ఒకటున్నది. పరస్పరం శత్రువులైన జంతువులు - ఉదాహరణకు పెద్దపులులు - మేకలు, కప్పలు - పాములు, ఆ దివ్య సంగీత ధ్వని వినగానే తమ శత్రుత్వాన్ని మరచిపోయేవి. మురళీ ధ్వని వాటి వాటి మనస్సులో ప్రవేశించి, వాటిలోని దుష్టప్రవృత్తులు, వాసనలను సద్గుగుణాలుగా మార్చివేసింది.

అటువంటి సర్వసమానత్వమూ, సౌభాతృత్వమూ, మరెవరైనా సాధించగలరా? "సర్వం పరం బ్రహ్మమ్" అని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. యమునా నదీ తీరాన ప్రతిధ్వనించిన వేణుగానం తీసుకుని వచ్చిన సర్వసమానత్వభావం సామ్యవాదానికి ప్రతీక. కాని ఆ ఘనత మురళికి దక్కుతుందా? విశ్వంలోని సంగీతాన్ని ఉద్భవింపజేసిన నీలమేఘశ్యామునిదే ఆ ఘనతంతా.శ్రీకృష్ణుడు తన మధుర వేణుగానంతో గోపికల మనస్సులలో విజ్ఞానాన్ని వికసింపజేశాడు. "నేనే పరమాత్మను మీరు ఇతర దేవతల కోసం ప్రాకులాడనవసరం లేదు" అని ఆయన వారితో అన్నాడు. అయినప్పటికీ ఆయనను నమ్మలేదు.

భగవంతునికి ఒక సమస్య ఉంది. ఆయన రూప రహితులుగా ఉంటే ప్రజలు ఆయన్ను చూడలేరు. ఆయన రూపం దాల్చి, వారి యెదుట నిలిస్తే,

మామూలు మనిషిగానే చూస్తారు. ఆ దేవదేవుడు దుష్టులను శిక్షించటానికి అవతరించటం ఆనాటి ప్రజల అదృష్టం. అయినప్పటికీ ఆయనను విమర్శించారు. ఆయన సామాన్య మానవుడనీ, నందతనయుడనీ కొందరు భావించారు. 'మనిషి దేవుడెలా అవుతాడ'ని ప్రశ్నించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించటానికి నలుగురు వ్యక్తులు తిరుపతి వెళ్ళారు. వారిలో ఒకరు స్వర్ణకారుడు. ఆయన దేవుని విగ్రహం చూసి, ఆయన వంటిపై ఆభరణాలు పరిశీలనగా చూశాడు. రెండవ వ్యక్తి శిల్పి. ఆయన ఏ రాతితో విగ్రహాన్ని మలచారో, అందులో శిల్ప కళానైపుణ్యాన్ని పరిశీలించడంలో నిమగ్నమయ్యాడు. మూడవ వ్యక్తి ఆగమశాస్త్ర విద్వాంసుడు. విగ్రహ స్థాపన గూర్చిన శాస్త్ర నియమాలను గురించి ఆలోచించాడు. నాలుగవ వ్యక్తి భక్తుడు. ఆయన మాత్రం అవేమీ చూడలేదు. ఆ పరమభక్తుడు వేంకటేశ్వరుని దివ్య మంగళ రూపాన్ని చూసి తన్మయత్వం పొందాడు.

భీష్ముడు, అక్రూరుడు, విదురుడు శ్రీకృష్ణునిలో పరమాత్మను దర్శిస్తే, దుర్యోధనాదులు వారందరినీ మానసిక దుర్బలులు అని వర్ణించారు. శ్రీకృష్ణుని దుర్యోధనాదులు ఇంద్రియాదులతో కూడిన మామూలు మానవునిగానే చూశారు. ఎందుకంటే వారు తమ యింద్రియాలకతీతంగా చూడలేకపోయారు. కానీ ఎవరైనా యింద్రియాలకు అతీతంగా ఆలోచించినట్లైతే, సర్వేంద్రియాలను అధిష్ఠించిన 'ప్రజ్ఞానం బ్రహ్మ'ను దర్శించవచ్చు.

కుండలోని ఖాళీ స్థలాన్ని ఘటాకాశం అంటారు. అది పగిలినప్పుడు ఘటాకాశం మహాకాశంలో లీనమవుతుంది. అలాగే యింద్రియాలతో కూడిన దేహం నశించినప్పుడు లోపలనున్న ప్రజ్ఞానం బ్రహ్మ విశ్వవ్యాప్తమైన బ్రహ్మ పదార్థంలో లీనమవుతుంది. ప్రాజ్ఞులు తమలో అంతర్దృష్టి వికసింపజేసుకుని, ఈ మృణ్మయ శరీరం కాకుండా, అంతర్గతంగా భాసిస్తున్న పరమ సత్యాన్ని సాక్షాత్కరింప జేసుకుంటారు.

ఈ శరీరంలో కామక్రోధ లోభమోహ మదమాత్సర్యాలనే ఆరు అంతః శత్రువులు, సత్వరజస్తమో గుణాలు ఉన్నాయి. భగవన్నామ జపంతో ఈ ప్రతిబంధకాలను విచ్ఛిన్నం చేస్తే భగవద్దర్శనం కలుగుతుంది. నామజపం ధ్యానంగా మారుతుంది. ధ్యానం జ్ఞానాగ్నిని ప్రజ్వరిల్ల చేస్తుంది. ఈ అగ్నిజ్వాల అన్ని ప్రతిబంధాలను, కర్మసంచితాన్ని భస్మీపటలం చేస్తుంది.

# ప్రపంచ మహాసభలలో శ్రీమాతాజీవారి దివ్య భాషణం

(సింహావలోకనం)    -కృష్ణారావు (ముంబయి)

ప్రపంచ మహాసభలలో దక్షిణాఫ్రికాలో శ్రీమాతాజీవారు కేప్‌టౌన్ నగరంలో 7-2-1999న ప్రపంచమంత మహాసభలలో (కేప్‌టెక్నికాన్‌లోని సైన్స్245 లెక్చర్‌హాల్‌లో) “ఆధ్యాత్మిక సాధనలో గురువు యొక్క ఆవశ్యకత” అనే అంశంపై శ్రీమాతాజీ చేసిన ప్రసంగం సమర్థ సద్గురు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే 2000 సంచికలలో ప్రచురితమైనది. ఈ ప్రసంగాన్ని కృష్ణారావుగారు స్వయంగా ఆ సభలకు వెళ్ళి అక్కడ వ్రాసుకున్న విషయాలను సంక్షిప్తంగా ఇక్కడ ప్రచురిస్తున్నాము............ ఎడిటర్.

మానవుడు చేసే ప్రతిపని మార్పుతో కూడినది. ఈ మారేదానిలో మారనిది ఒకటి ఉన్నది. అదే సత్యవస్తువు. అది విచారణ ద్వారా తెలుస్తుంది. ఈ సత్యాన్ని గుర్తింపజేసేవాడే గురుదేవుడు. సత్యమనేది ప్రతి అణువులోనూ ప్రకాశిస్తోంది. అది గ్రహించినవాడికి విశ్వప్రేమ అలవడుతుంది.

ఈ ప్రపంచంలో దారాపుత్రాదుల, బంధువుల ప్రేమ అస్థిరము. భగవంతుని ప్రేమ సుస్థిరము. ‘**సా భక్తి ప్రేమ రూపా**’ అని నారద భక్తి సూత్రాలలో చెప్పబడింది. నిష్కళంకమైన ప్రేమే భక్తి.

ప్రతిమానవుడు ఆనందాన్ని సుఖశాంతులను కోరతాడు. కాని ప్రపంచ విషయాదుల వెంట పరుగెడుతూ దుఃఖాల పాలవుతాడు. శాశ్వత ఆనందాన్ని పొందాలంటే సత్యగురుదేవుని ఆశ్రయించాలి.

***ధ్యానమూలం - గురోర్మూర్తిః***
***పూజామూలం - గురోః పదం***
***మంత్రమూలం - గురోర్వాక్యం***
***ముక్తిమూలం - గురోఃకృపా***

అని చెబుతోంది గురుగీత.

మనుష్యజన్మ రావటం, మోక్షం కావాలనే కోరిక కలగటం. మహాత్ముల సాంగత్యం ఈ మూడు అత్యంత దుర్లభమైనవి అని చెప్పారు ఆది శంకరాచార్యుల వారు.

***దుర్లభం త్రయమేవతత్! దైవానుగ్రహ హేతుకమ్***
***మనుష్యం! ముముక్షత్వం! మహాపురుష సంశ్రయమ్!***

అటువంటి మానవజన్మ వచ్చినందుకు మహాత్ములను ఆశ్రయించి, వారు చెప్పిన బాటలో నడిచి మోక్షం పొందటానికి ప్రయత్నించాలి. కాని అహంకార మమకారాలకు లోబడి మానవులు 'నా దేవుడు', 'నా మతం' అని అడ్డుగోడలు కట్టుకుంటారు. దేవుడు త్రికాలాబాధ్యుడు అని గ్రహించలేక 'నా దేవుడే గొప్ప', 'నా మతమే గొప్ప' అంటూ విశ్వనాధుని మరుస్తున్నారు.

స్వామి వివేకానంద, శివాజీమహరాజ్‌వంటి వారు యీనాటికీ ప్రకాశిస్తున్నారంటే వారు వారి గురువులను అచంచల విశ్వాసంతో ఆశ్రయించి, వారి బాటలో నడిచి చూపించారు.

***మన్ కవాట్ ఖోలో మలిన విషయ ధోలో***
***రామ్‌కో బులాలో ప్రేమసే బసాలో***

గురుదేవులు మనని పరీక్షలు పెడతారు. చూడండి కాంక్రీట్ స్లాబ్ వేసేటప్పుడు ఎక్కడైనా ఖాళీలు ఉన్నాయోమో అని వైబ్రేటర్‌తో కుదిపి చూస్తారు. గురుదేవులు కూడా మన సాధన సరైన మార్గంలో నడుస్తోందా లేదా అని చూస్తారు.

మాతాజీ ప్రసంగం చేస్తుండగా ఒక శ్రోత యిలా ప్రశ్నించాడు......

**ప్రశ్న -** చాలామంది మహాత్ములను చూశాను. ఏ గురువును ఆశ్రయించాలో తెలుసుకోలేకుండా ఉన్నాను. నాకు కర్తవ్యాన్ని బోధించండి మాతాజీ!

**జవాబు -** ప్రపథమంగా ఎవరిని ఆశ్రయించావో వారి పాదాలను విడువకు. నీ గురుదేవుని యందు గాఢమైన నమ్మకం కుదిరితేఇతరులను ఆశ్రయించ వలసిన పని లేదు. సత్యగురుదేవుడు తన శిష్యుడు ఎక్కడున్నా అతనిని ఉద్ధరిస్తాడు. తాబేలు తన పిల్ల ఎక్కడ ఉన్న ఆహారం అందిస్తుంది. కాని అది తాబేలుపిల్ల అయి ఉండాలి. సత్య గురువు తన సంకల్పంతో, దృష్టితో, స్పర్శతో శిష్యునికి ఏది అవసరమో అది అందజేస్తాడు.

**ప్రశ్న -** మాతాజీ! సత్యగురుదేవుని తెలుసుకోవటం ఎలా?

**జవాబు -** నీ ఆవేదన సరి అయితే నీవు సత్యగురువుని వెతుక్కోనవసరంలేదు. ఆయనే నిన్ను వెతుక్కుంటూ వస్తాడు. వారిని ఎలా తెలుసుకోవటం అనేదే ప్రశ్న. ఎవరి సన్నిధిలో నీకు తెలియకుండా నీమనస్సు ప్రశాంతతని, హాయిని పొందుతుందో వారే సత్యగురుదేవులని తెలుసుకో.

ప్రశ్న - గురువును ఎప్పుడు ఆశ్రయించాలి?

జవాబు - ఇప్పుడే! ఈ క్షణం నుండే! మన ఆఖరి శ్వాస ఎప్పుడో మనకి

తెలియదు. వినయంతో, ఆవేదనతో సద్గురువును ఆశ్రయించాలి.

ప్రశ్న - సత్యవస్తువును తెలుసుకోవటం చాల కష్టం. దారిలో ఎన్నో అవాంతరాలు ఉంటాయి. ఏం చేయాలి?

జవాబు - ధ్యానం చెయ్యి. ధ్యానం వల్ల మనస్సు ప్రశాంత చెందుతుంది. గురుదేవులే నీ వద్దకు వచ్చి మార్గాన్ని చెబుతారు.

ప్రశ్న - ధ్యానంలో ఎంతసేపు కూర్చోవాలి?

జవాబు - ధ్యేయ వస్తువుపై నీ మనస్సు నిలిచినంత వరకు చేయాలి. మొదట్లో ధ్యానానికి ఒక నిర్ణీత సమయం పెట్టుకోవాలి.

ప్రశ్న - మనస్సు భగవంతునిపై నిలవాలంటే ఏం చేయాలి?

జవాబు - నీకు క్లాసులో చెప్పిన పాఠం రాలేదనుకో. ఏం చేస్తావు? నీకు పాఠం వచ్చేవరకు చదువుతావు కదా! అలాగే ఏదో ఒకసారి కూర్చుని భగవంతుని తలవటం కాదు. నియమిత సమయాలలో భగవంతుని ధ్యానించాలి. మనస్సు నిలవటం లేదని ధ్యానం మానకూడదు. ధ్యానం చేయగా చేయగా మనస్సు భగవంతునిపై తప్పక నిలబడుతుంది. నీవు ఆశ్రయించిన సద్గురువుపై అచంచల విశ్వాసం కలిగి ఉండాలి. గురుదేవులు చెప్పింది చెప్పినట్లు చేయాలి. నిరంతర ధ్యానంతో తప్పక నువ్వు నీ లక్ష్యాన్ని సాధించగలుగుతావు.

ప్రశ్న - ఇంతమంది దేవుళ్ళు ఎందుకు ఉన్నారు? ఎవరిని నమ్మాలి?

జవాబు - మానవులకు అనేక టేస్టులు ఉంటాయి కదా! కొందరికి రాముడంచటే, కొందరికి కృష్ణుడంటే ఇష్టం. కొందరికి శివుడంటే యిష్టం. అలాగే కొందరికి జగన్మాత అంటే యిష్టం. ఏ పేరు పెట్టి పిలిచినా భగవంతుడు ఒక్కడే. ఆయన అనంతశక్తి స్వరూపుడు. మనకోసం ఒక రూపం కల్పించుకొని వస్తాడు. దానికి ఉదాహరణ చెబుతాను.

బంకమట్టితో బొమ్మచేసి ఒకరు కృష్ణుడు అంటారు. ఇంకొకరు క్రీస్తు అంటారు. ఎవరు ఎన్ని బొమ్మలు చేసినా, ఏమని పిలిచినా అవన్నీ బంకమట్టి నుండి వచ్చినవే. సాధకుడు తన యిష్టదైవంలోనే సకల దేవతలను దర్శించగలగాలి. అప్పుడే అతనికి భగవత్తత్త్వం బోధపడినట్లు గుర్తింపు. ఆ భగవానుడు సర్వవ్యాపి. సకల చరాచర సృష్టికి ఆధారభూతమైన దివ్య చైతన్యమని తెలుసుకుంటాడు. అది తెలుసుకోవటానికి సత్యగురువు ఆవశ్యకత ఎంతైనా ఉంది. వారి దివ్యానుగ్రహం వల్లనే భగవత్తత్త్వం మనకు అవగత మవుతుంది.

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు పూజగదిలో పూజ చేసుకుంటున్నప్పుడు, ఒక్కొక్కసారి గణ గణమని గంటలమోత వినబడేది. శ్రీబాబుతో ఎవరో మాట్లాడుతున్న శబ్దాలు, శ్రీబాబు మాటలు కూడ అస్పష్టంగా వినపడేవి. అలాగే ఎవరైనా శ్రీబాబు వద్దకు ఏదైనా సమస్యతో వచ్చినప్పుడు ఆ దేవతార్చన పెట్టెనుంచి టక్,టక్ మంటూ టెలిగ్రామ్ సంకేతాలవలె, అందరికీ కూడా వినబడేవి. శ్రీబాబు కూడ ఏదో అస్పష్టంగా తమలో తాము మాట్లాడుకునేవారు. అవన్నీ ఆగిపోయిన తరువాత, శ్రీబాబు వారు తెచ్చిన సమస్యల చిక్కు విడదీసి వారికి సమాధానం చెప్పేవారు. తమ సమస్యను గురించి శ్రీబాబు అమ్మకు మనవి చేశారని, అమ్మ వాటికి సమాధానాలు అందజేసినదని, అక్కడి వారందరి ప్రగాఢమైన విశ్వాసము. అలా చెప్పినవన్నీ నిజం కావటంతో, వారి విశ్వాసం మరింత బలపడేది. ప్రతి ఒక్కరిలోను, జగన్మాత యెడల భక్తి ప్రపత్తులు పెరగాలని, వారిని నిజభక్తులుగా తీర్చి దిద్దాలనే శ్రీ బాబు ఆశయం అలా నెరవేరేది.



అనేక ప్రదేశాలలో శ్రీబాబు భక్తులు ఇలాంటి అనుభవాలను పొందిన వారనేకులున్నారు. సామాన్య ప్రజలు, జగన్మాత ఆ పెట్టెలోనుండి శ్రీబాబుతో మాట్లాడుతున్నదనుకుంటారు.కొంచెం వివేకంతో ఆలోచించేవారు, ఆ దేవతార్చన పేటిక, శ్రీబాబు హృదయమేనని, అదే జగన్మాతకు, నిజ స్థానమని, అక్కడ నుండి మాట్లాడేది కూడా శ్రీబాబేనని, గురువుకు జగన్మాతకు, అంటే భగంతునికి, భేదంలేదని గ్రహించేవారు.

భోగిరెడ్డి వెంకటగిరిగారు, వీరభద్రరావుగారు, తదితరులు కూడా శ్రీబాబుతో సన్నిహితంగా ఉండేవారు. గిరిగారి కుమారుడు కొండలరావుగారు ఎప్పుడూ శ్రీబాబుకు అందుబాటులో ఉంటూ, సేవ చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతుండేవారు. ఏదైనా పనిమీద, ఎవరినైనా, ఎక్కడికైనా పంపవలసివస్తే, శ్రీబాబు కొండలరావుగారిని పిలిచేవారు. ఒకసారి కొండలరావుగారి సోదరుడికి

చాల సుస్తీ చేసి, ప్రమాదకర పరిస్థితి వచ్చింది. అర్థరాత్రివేళ శ్రీబాబును లేపారు. శ్రీబాబు బయటకు వచ్చి, కొండలరావుగారు ఏమీ చెప్పకముందే, వారి సోదరుడి సుస్తీ విషయం ప్రస్తావించి, పరవాలేదని, కాని పుట్టింటికి బూరుగుపల్లి వెళ్ళిన కొండలరావుగారి భార్యకు ధనుర్వాతం వచ్చిందని, చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోందని చెప్పి,, అప్పటికప్పుడు రెండెడ్ల బండి కట్టించుకుని బూరుగుపల్లి వెళ్ళారు. అప్పటికే ఆమె చనిపోయింది. కాని శ్రీబాబు జగన్మాతను స్మరించి తీర్థమును ఆమెపై ప్రోక్షించారు. ఆమె నిద్రనుండి లేచినట్లు లేచి కూర్చుంది.

పండుదొరగారు శ్రీబాబుకి ఎంత భక్తులో, ఆయన అన్నగారైన గోపాలం గారు అంత విముఖంగా ఉండేవారు. ఆస్తుల విషయంలో గోపాలంగారు అనేక దావాలు పండు దొరగారిపైన వేశారు. కానీ శ్రీబాబు పండు దొరగారికి మంత్ర దీక్ష ఇచ్చి, **48** శనివారాలు పూజలు చెప్పారు. ఆ దీక్ష పూర్తి అయిన రోజుననే అన్ని దావాలలోనూ నెగ్గినట్లు ఆయనకు కబురు వచ్చింది. ఈ సంఘటన వలన గోపాలంగారికి శ్రీబాబు యెడల మరింత వైమనస్యం ఏర్పడింది. శ్రీబాబు మాత్రం వారి యెడల ప్రేమనే చూపేవారు. తరువాత గోపాలంగారి రెండవ కోడలు గ్రహబాధా పీడితురాలైతే, శ్రీబాబుకు ఆ విషయం తెలిసి ఆమెను గుంటూరు పిలిపించి బాధా నివారణ చేశారు. ఆ సంఘటనతో గోపాలంగారు శ్రీబాబు ప్రేమతత్త్వమును గుర్తించి, పశ్చాత్తప్తులై పరమ భక్తులైనారు.

యనమదుర్రులోనే భూషణంగారు, అప్పన్నగారు మొదలైన వారు కొందరు శ్రీబాబును విమర్శించి, దూషించారు. గ్రామస్థులు ఖిన్నులై వారి విషయం శ్రీబాబుకు తెలిపారు. శ్రీబాబు ప్రశాంతంగా "వీధిలో వెళ్ళే జంగమ దేవరను చూచి, కుక్కలు మొరిగితే మాత్రము, ఆ జంగమదేవరకు ఏమి లోటు? అయినా, వాళ్ళూ జగన్మాత బిడ్డలే గదా! వాళ్ళనెలా చక్కదిద్దాలో జగన్మాతే చూసుకుంటుంది" అన్నారు. ఆ విమర్శకులకు విరేచనాలు పట్టుకున్నాయి. ఎంతకూ తగ్గకపోతే,వాళ్ళ బంధువులు వచ్చి శ్రీబాబుతో మొర పెట్టుకున్నారు. "మజ్జిగ ఇవ్వండి తగ్గిపోతుంది" అని శ్రీబాబు చెప్పారు. అలాగే జరిగింది. వాళ్ళ కూడా శ్రీబాబు వద్దకు వచ్చి లెంపలు వేసికొని, నమస్కారం చేసుకున్నారు.

-సశేషం

# ఘటాకాశం - మహాకాశం

- కొండ వెంకట్రాజు

మహాత్ములు తమ ప్రసంగాలలో ఘటాకాశం, మహాకాశాల గురించి చెప్తుంటారు. ఈ సృష్టిలోని వస్తువులను ఘటాకాశంతో పోలిస్తే, పైన కనపడే వినీలాకాశాన్ని మబాకాశం అనుకోవచ్చు. ఈ అనంతాకాశంలో మనకు సూర& చంద్రులు, నక్షత్రాలు, పాలపుంతలు మనకి కనిపిస్తాయి. ఈ సక్షత్రరాసులలో అనేక గ్రహాలూ గ్రహకుటుంబాలూ ఉన్నాయి.

పంచభూతాలు - పృధ్వి, అగ్ని, జలము, వాయువు, ఆకాశం ఉన్నాయి. సూర్యుడిని ప్రత్యక్షభగవానుడిగా ఆరాధిస్తాము. జీవుడిలోకూడా ఈ పంచభూతాలూ ఉన్నాయి. అలాగే ఈ సృష్టికూడా పంచభూతాలవల్లనే నడుస్తోంది. సూర్యుడి శక్తి వల్ల కిరణజన్య ప్రక్రియ జరిగి వృక్షాదులు మనకు ఫలాలను ఇస్తున్నాయి. నీరు ఆవిరిగామారి సకాలంలో వర్షాలు కురవటం వల్ల అన్నము, ఔషధులు లభిస్తున్నాయి.

ఘటాకాశం గురించి కొద్దిగా అవగాహన చేసుకుందాం. ఒక కుమ్మరి ఒక కుండ తయారు చేస్తాడు. దానితో మనం అనేక పనులు చేసికోవచ్చు. నీళ్ళు పట్టుకోవచ్చు. వంట చేసికోవచ్చు. ఈ కుండ ఎక్కడనుంచి వచ్చింది? అనంతాకాశంనుండి. కుండ తయారు కాగానే ఇందులో ఉన్నదానిని ఘటాకాశం అంటున్నాము. కుండ విచ్ఛిన్నం అయితే అందులోని ఆకాశం ఎక్కడికి పోయింది. ఎక్కడికీ పోలేదు. కుండ విచ్ఛిన్నం అవగానే మిగిలేది మహాకాశమే. శ్రీ మాతాజీవారు ఈ ఘటాకాశం గురించి చెప్పి ఇదేవిధంగా జీవాత్మకూ పరమాత్మకూ తేడా లేదు అని చెప్తారు.

పరమాత్మ సర్వవ్యాపకత్వం గురించి తెలుసుకున్నాము కదా.ఆత్మ శరీరం అనే ఆచ్ఛాదనం ధరిస్తే జీవుడు అంటున్నాము. ఇదేవిధంగా ఈ సమస్త సృష్టిపరమాత్మనుండి వచ్చింది అని గ్రహించాలి. గీతాచార్యుడు ఇదే చెప్తున్నాడు - "నేను నీలోనే ఉన్నాను అని గ్రహించు. ఈ జగత్తు అంతా నా అంశ అని తెలుసుకో" అని.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః భ.గీ 6(29)**

యోగ సిద్ధి పొందినవాడు అన్ని భూతాల పట్ల సమభావం కలిగి, సర్వభూతాలలో తన అత్మను,తన ఆత్మలో సర్వభూతాలను చూస్తాడు.

**సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి న ప్రియః।**
**యే భజంతి తుమాం భక్త్యా మయితేషుచాప్యహమ్॥భ.గీ9(29)**

భగవానుడు అంటున్నాడు - " సమస్త ప్రాణులపట్ల సమభావం కలిగిన నాకు విరోధిగాని ఇష్టుడు గాని లేడు. నన్ను భక్తి తో కొలిచే వారు నాలోనూ, నేను వారిలోనూ ఉంటాను"అని.

జీవుడి శరీరం పోతే జీవాత్మ ఇంకొక శరీరంలోకి ప్రవేశిస్తుంది. భగవంతుణ్ణి మనసా, వాచా కర్మణా మనం జీవించినంతకాలం కొలుస్తూ ఉంటే, జీవాత్మ పరమాత్మలో ఐక్యం అవుతుంది. అది తిరిగి మరల జన్మను పొందదు. మనం కర్మ సంచితాలతో మరణిస్తే మరొక జన్మ తప్పదు.

మరి నేను ఈ విషయాన్ని యీ విధంగా అర్థం చేసుకున్నాను. ఆ అనుభూతిని మనం పొందాలి కదా! ఒకాయన" కాజా చాలా తియ్యగా ఉంది" అన్నాడు. మరి ఆ తీపిని అనుభవించాలంటే ఆ కాజా నువ్వు తింటేనేగా నీకు తెలిసేది. కాబట్టి భగవదనుభూతిని పొందాటానికి, ఎవరి ప్రయత్నం వారు చేయాలి.

"రాతిని మాత్రంకంటే దేముడు కానరాడు. దేముని మాత్రం కంటే దేహం కానరాదు". ఇది అనుభవంలోకి రావాలంటే ఎల్లప్పుడూమనస్సును పరమాత్మ భావనలో ఉంచాలి. గురుబోధను చక్కగా శ్రవణంచేసి మననంలోకి తెచ్చుకోవాలి. అప్పుడు అనుభవ పూర్వకంగా తెలుస్తుంది. ఘటాకాశం - మహాకాశం అంటే జీవాత్మ - పరమాత్మ అని. అట్టి పరమాత్మ స్థితిని పొందాలంటే సద్గురువు చెప్పింది ఆచరించి అనుభవంలోకి తెచ్చుకోవాలి.

## సమ్మర్ క్లాసెస్

నంబూరు కాళీగార్డెన్స్ ఆశ్రమంలో బాలబాలికలకు సమ్మర్ క్లాసెస్ మే నెల నుండి ప్రారంభం అవుతాయి. ఈ తరగతులలో ఉపనిషత్తులు, భగవద్గీత, ప్రార్థనా గీతాలు నేర్పబడతాయి. ఈ క్లాసెస్ 3 వారాలపాటు జరుగుతాయి. తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవటానికి వారి పిల్లలను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

# అపరోక్షానుభూతి

(గతసంచిక తరువాయి)

-పరాశర ప్రసాద్

సద్గుణ సంపన్నుడైన సాధకుడు సద్గురుమూర్తిని పరిపూర్ణ విశ్వాసంతో ఆశ్రయించినప్పుడు అధికారి అనిపించుకుంటాడు. ఆ అధికారికి సద్గురుమూర్తి తెలియజేసే విషయమే అపరోక్షానుభూతి.

శ్రీసద్గురుదేవులు బోధించటం, సాధకుడు శ్రవణం చేయటం సంబంధం అనిపించుకుంటుంది. దాని ప్రయోజనం మోక్షం. మోక్షం అనేది ఎప్పుడో వచ్చేదికాదు. నీ స్వస్వరూపము ఎక్కడి నుంచో తెచ్చుకోనవసరం లేదు. అది నీలోనే ఉంది. దానిని తెలియజేసే వాడు గురుమూర్తి.

అపరోక్షానుభూతి పొందాలంటే వైరాగ్యం కలగాలి. అప్పుడే భగవదనుగ్రహం సాధించ గల్గుతావు. అది సాధించిన వెంటనే శమము, దమము కల్గి వివేకము, ఓర్పు, విజ్ఞానముతో నీలో దాగి ఉన్న జ్ఞానాన్ని యితరులకు పంచిపెట్టగలుగుతావు.

సాత్వికాహారం తీసుకుంటూ, సత్యమార్గంలో నడుస్తూ నీ బుద్ధిని జ్ఞానంలో నిమగ్నం చేయాలి. నీ చేతులతో దానం చేయాలి, నీ పాదాలతో ధర్మమార్గములో సంచరించాలి. అప్పుడు వైరాగ్యం తప్పక కలుగుతుంది. వైరాగ్యమంటే బ్రహ్మము నుండి ప్రాంచిక విషయాదుల వరకు విముఖత కలిగి ఉండాలి. అది సాధ్యమేనా అని అనుమానం కలగకపోదు. సాధకునికి దుస్సాధ్యమైనది లేదు.

విషయాదులలోని లోపాలను గుర్తించటానికి ప్రయత్నిస్తే తప్పక వాటిని త్యజించ గలుగుతావు. ప్రాపంచిక వ్యవహారాలలో దోషవృత్తి గమనించిన మరుక్షణం వైరాగ్యం కలుగుతుంది. మానవుని జీవితం అల్పమైంది. రావి ఆకు చివరనున్న నీటి బిందువు ఎప్పుడు రాలిపోతుందో మానవ జీవితం కూడా అంతే.

నిర్మల వైరాగ్యం కలిగిన వెంటనే సద్గురుమూర్తి బోధలోని మాధుర్యాన్ని ఆస్వాదించ గల్గుతావు. ఆ క్షణమే నిత్యానిత్య వస్తు వివేకం కలుగుతుంది. జగత్తులో ఉన్నవాడికి చూచేవాడు, చూడబడే వస్తువూ రెండూ ఉన్నాయి. బ్రహ్మాండములో జగత్తు అనిత్యము, బ్రహ్మము నిత్యము. పిండాండములో దేహము అనిత్యము. ఆత్మ నిత్యము.

గ్లాసుతో వేడి పాలు తెస్తే ఆ గ్లాసు వేడిగా ఉంది అంటారు. అసలు వేడిగా ఉన్నది పాలు, గ్లాసు కాదు. అలాగే దేహాన్ని ప్రకాశింపచేసేది దేహి లేక ఆత్మ. ధర్మాన్ని దేహానికి ఆపాదించి శరీరం శాశ్వతం, శరీరం నేను అనే భావన కలుగుతోంది. సందేహము, దోషము లేకుండా విశ్వసించటమే వివేకము. బుద్ధిలోని వివేకదృష్టి బయల్పడటానికి గురుబోధా శ్రవణం దోహదం చేస్తుంది.

జన్మకి కారణం కర్మ. కర్మకి కారణం రాగద్వేషాలు. రాగద్వేషాలకు కారణం ద్వైత బుద్ధి. అదే అజ్ఞానం. అది తొలగాలంటే సద్గురుమూర్తిని ఆశ్రయించ వలసిందే. శ్రవణం లవణంలాగ ఉండాలి. మననం పర్వతంలాగా, నిదిధ్యాస సముద్రంలాగా ఉండాలి. శ్రవణం జరిగిన వెంటనే మననం జరగాలి. గురు సాన్నిధ్యంలో శ్రవణం చేసినదంతా తెలిసినట్టే ఉంటుంది. గుమ్మం దాటిన వెంటనే మరపు వస్తుంది. అది మాయా ప్రభావం.

మనస్సుని సద్గురుదేవుల దివ్య చరణారవిందాలకు అర్పించటం అంటే వస్తువులాగ పెట్టటం కాదు. మనస్సులో రెండు వస్తువులున్నాయి. అవి 1. ప్రాకాశంశము. 2. వికారాంశము. మనస్సును సరిగా వాడుకుంటే దేవత లేకపోతే భూతం.

గృహస్థాశ్రమంలో ఏ పనిచేసినా భగవద్భావనతో చేయాలి. నిదుర లేవగానే భగవన్నామ స్మరణతోనూ, నిదురించే ముందు భగవన్నామ స్మరణ చేసి, సద్భావనతో ఏ కర్మ చేసినా ఆ కర్మ అంటదు. శ్రద్ధ అవసరం. శ్రద్ధ ఎంత ఉంటే సిద్ధి అంత ఉంటుంది. శాస్త్రవాక్యమునందు, గురువాక్యము నందు శ్రద్ధ కలిగి ఉండాలి. సందేహాలు ఉండకూడదు. సంశయాత్మకుడు ఎన్నడూ అపరోక్షానుభూతిని పొందజాలడు.

తప్పుచేసినవాడికి శిక్ష వేయటం, శిక్షణ యివ్వటం సహజం. కాని సద్గురుమూర్తి శిష్యుని సహనాన్ని పరీక్షించేందుకు తప్పు చేయకపోయినా శిక్షించవచ్చు. అది విశ్వాసానికి పరీక్ష. సద్గురుమూర్తి ఏది ఆదేశిస్తే దానిని స్వీకరించటమే శిష్యుడు చేయవలసినది, చేయదగినది. అది పరిపూర్ణ విశ్వాసానికి తార్కాణము. శ్వాస పోయినా పర్వాలేదు, విశ్వాసం మాత్రం పోకూడదు.

-సశేషం

| |
|---|
| గాఢమైన విశ్వాసమే భక్తి - కాళీబాబు |

# బెంగుళూరులో శ్రీ మాతాజీ సత్సంగం

(గతసంచిక తరువాయి) **సుందరకాండ** -రమణ ప్రసాద్

రామ నామం చేస్తూ ఆకాశ మార్గాన వెల్తున్న మారుతిని మైనాకుడు ఆతిథ్యం యివ్వటానికై హనుమంతునితో "నామీద కొంత సేపు విశ్రాంతి తీసుకోండి" అని ప్రార్థించాడు. మైనక పర్వతం సత్వ గుణానికి సంకేతం. "నేను రామకార్యార్థమై వెల్తున్నాను. ఇప్పుడు నేను మీ అతిథ్యం స్వీకరించలేను." అని చెప్పి ఆకాశయానం సాగిస్తాడు.

నాగదేవతలు హనుమంతుని శక్తి సామర్థ్యాలను పరీక్షించమని సురసను పంపారు. సురస రజోగుణానికి సంకేతం. హనుమంతునికి అడ్డుగా నిలిచి పెద్దగా నోరు తెరిచింది. సూక్ష్మరూపం ధరించి లోపలికి వెళ్ళి తన శరీరాన్ని పెంచి దాని పొట్ట చీల్చి బయటకు వచ్చాడు.

తన వేగాన్ని ఎవరో అనవరోధిస్తున్నట్లు గమనించాడు. గమనానికి అడ్డువచ్చింది సింహిక తమో గుణానికి సంకేతము. సింహికను సంహరించి ముందుకు సాగాడు.

మానవుడు జనన మరణ ప్రవాహంలో కొట్టుపోవటానికి కారణం సత్వరజస్తమోగుణాలు. దాస్య భావం ఉంటే యీ మూడు గుణాలు మన వెంట ఉంటాయి. భగవంతుని పాదాలను ఆశ్రయించిన భక్తుడు రెండు మార్గాల ద్వారా తరించవచ్చు అన్నారు శ్రీగురుదేవులు. అవి భక్తి జ్ఞాన మార్గాలు. సముద్రంలో స్నానం చేసేటప్పుడు కెరటం వస్తే తల వంచాలి. లేదా కాళ్ళు పైకెత్తాలి. కెరటం వచ్చినప్పుడు తల వంచటం భక్తిమార్గం, కాళ్ళు పైకెత్తి ఎగరటం జ్ఞానమార్గం అన్నారు. మనం ఆశ్రయించిన పాదాన్ని కులశైలములు పెల్లగిలి వచ్చి పైబడినా, జలరాసులే పొంగి ప్రళయమే కలిగినా చలించకూడదు.మన జీవిత గమ్య స్థానం చేరేవరకు దృఢమైన దీక్ష కలిగి ఉండటమే మానవ జన్మకు సార్థకత.

మనస్సు సంకల్పిస్తుంది. చిత్తం ఊహిస్తుంది. బుద్ధి మార్గం యిస్తుంది. అహంకారం క్రియారూపంలో పెడుతుంది. యీ సంకల్పాలు అదుపులోకి రావాలంటే సంకల్పించే మనస్సు సత్యంగాను, ఊహించే చిత్తం శాంతిగాను,

నిర్ణయించే బుద్ధి దయగాను క్రియచేసే అహంకారం ప్రేమగాను మారాలి. అప్పుడు సత్యమే గోచరమవుతుంది. సత్యమే పరమాత్మ వస్తువు, సత్యం కోసమే సత్సంగం.

***తుషేణ బద్ధో వ్రీహిస్యాత్ తుషాభావేతు తండులః*** - స్కందోపనిషత్తు. వాచార్థంలో ఉన్న వడ్లగింజ లక్ష్యార్థం స్వీకరిస్తే అహంకా మమకారాలు అనే రెండు పొరలూ తొలగి బియ్యపు గింజ అవుతుంది. వడ్లగింజ మొలకెత్తుతుంది. బియ్యపు గింజకు పునరావృత్తి లేదు. ఎవరైతే అహంకార మమకారాలను రహితం చేసుకుంటారో వారు తరిస్తారు. రావణ పతనానికి కారణం అహంకార మమకారాలే. రావణుడు గొప్ప తపస్వి కాని అహంకార మమకారాలను వీడలేదు. సీతమ్మను కామవాంఛతో చూశాడు. అమ్మ అగ్ని. రావణుని ఒక గడ్డిపోచతో పోల్చింది.

లంకానగర ప్రవేశానికి ముందు హనుమంతునికి లంఖిణి అడ్డుగా నిలిచింది. లంఖిణిని ఒక దెబ్బవేశాడు. లంఖిణికి కళ్ళు తిరిగాయి. పూర్వం యిచ్చిన శాపం గుర్తుకువచ్చింది. ఒకనాడు ఒక వానరం వచ్చి లంకలో ప్రవేశిస్తుందో అప్పుడవి లంకకు చేటు వాటిల్లినట్లే అని. లంఖిణి దారి యిచ్చినిది. శత్రు సంహారానికి దొడ్డిదారిని ప్రవేశించాలట. ఆంజనేయుడు ఆలాగనే ప్రవేశించాడు. లంకలోని చక్కని భవనాలను చూశాడు. వాద్యాలు విన్నాడు. అయినా ఆయన దృష్టి అమ్మ అన్వేషణమీద ఉన్నది. రావణుని అంతఃపురంలో ప్రవేశించాడు. అక్కడ వాయిద్యాలు వాయించి, నాట్యాలు చేసి, సొమ్మసిల్లి నిద్రిస్తున్న స్త్రీలను చూశాడు. రావణుని తల్పంపైన నిదురిస్తున్న సౌందర్యవతిని చూసి ఒక్క క్షణం 'ఈమె మా అమ్మ సీతమ్మ కాదు కదా!' అని భ్రమ చెందాడు. వెంటనే 'నా కోతి బుద్ధి పోలేదు. మా యిక్కడ ఉండదు' అనుకొని బయటకు వచ్చాడు. మనం కూడా ఆత్మ విమర్శ అలా చేసుకోవాలి. సాధకుడైనవాడు గమనించాల్సిన విషయం ఇంకొకటి ఏమిటంటే నా మనస్సు, ఇంద్రియాలు, నియంత్రణగా ఉన్నాయా లేవా అని. హనుమంతుడు నా మనస్సేమైనా చలించిందా అని తనని తాను ప్రశ్నించుకున్నాడు. లేదు చలించలేదు అని నిర్ణయించుకున్నాడు. అమ్మ ఇక్కడ ఉండదు అనుకొని బయట అశోకవాటిక వైపు వెళ్ళాడు.

-సశేషం

# మాణిక్య వాచకార్

(గతసంచిక తరువాయి)

- సుషుమ్న ప్రసాద

అతని భక్తికి పరవశించి పరమశివుడు అతని శిక్షను తొలగించాలి అనుకొని, ఆ నదికి అకస్మాత్తుగా వరదలు వచ్చేట్లు చేశాడు. వైగా నదీ ప్రవాహాన్ని అదుపులో పెట్టటం ఎవరికీ సాధ్యం కాక, రాజుగారు వెంటనే తన సైన్యాన్ని నదికి ఆనకట్ట కట్టమన్నాడు. కాని ఆ బృహత్కార్యానికి తగినంత సైన్యము లేక రాజుగారు తన రాజ్యములో ప్రతి కుటుంబం నుండి ఒక యువకుణ్ణి పంపమన్నాడు.

ఆ మధురై నగరిలో ఒక ఒంటరి వృద్ధురాలు ఉన్నది. ఆమె పేరు వంధి. సైనికులు ఆమెకు సంతానము లేకపోయినా ఆమె బంధువులలో యెవరినైనా ఒకరిని ఆనకట్ట నిర్మాణానికి పంపమని నిర్బంధము చేశారు. ఆమె తనకు భగవంతుడైన పరమశివుడు తప్ప ఆదుకునేవారెవరూ లేరన్నది. సైనికులామె ప్రార్థనను పెడచెవిని పెట్టి "ఏమైనాసరే, రేపటిలోగా నీ తరఫున ఎవరినో ఒకరిని పంపాలి. లేకుంటే రాజు ఆగ్రహానికి గురౌతావు" అన్నారు.

కరుణామయుడైన పరమేశ్వరుడు ఒక కుఱ్ఱవాని రూపంలో, ఆమె వద్దకు వచ్చి, "అవ్వా! నాకు చాల ఆకలిగా ఉంది. కొంచెం ఆహారం పెట్టు. దానికి ప్రతిఫలంగా నీకు సేవ చేస్తాను" అన్నాడు. వంధి చివరకు తనకు సహాయము చేయటానికి యెవరో ఒకరు తటస్థపడ్డారని సంతోషించింది. తన యింట్లో ఉన్న ఆహారాన్ని ఆ కుర్రవానికి పెట్టింది. సంతృప్తిపడ్డ ఆ కుర్రవాడు నదీ సమీపానికి వెళ్ళి అక్కడ చెట్టు నీడలో నిద్రపోవటం ప్రారంభించాడు. ఆ నిర్మాణ కార్యక్రమాన్ని పరిశీలించటానికి వచ్చిన రాజుగారు ఆ కుర్రవాడు నిద్రించడం గమనించి, అతని వీపుపైన కర్రతో బాదాడు. కాని ఆ దెబ్బ యొక్క బాధను రాజుగారు, అతని వెంట వచ్చిన పరివారము అనుభవించవలసి వచ్చింది. ఆ కుర్రవాడు రాజుగారి వంక ప్రశ్నార్థకంగా చూచి, ఒక తట్టెడు బురదమట్టిని నదిలోకి విసిరాడు. వెంటనే మహాద్భుతంగా ఒక తృటికాలంలో వరద కట్టుబడ్డది. వెంటనే ఆ ప్రదేశం నుంచి ఆ కుర్రాడు అదృశ్యమైనాడు.

పాండ్యరాజు జరిగిన సంఘటనలకు కలవరమంది, మాణిక్యవాచకర్ పాదాలపై పడి క్షమాపణ కోరాడు. వెంటనే ఆకాశము నుండి దివ్యవాణి యిలా వినిపించింది.

"ఓ రాజా! యివన్నీ నా లీలలో భాగం. నీ ద్రవ్యాన్ని సద్వినియోగం చేసి, మాణిక్యవాచకార్ నీకు స్వర్గంలో వసతిని కేటాయించాడు. వంధి యొక్క ఆత్మ కూడా నా కృపచే రక్షింపబడ్డది. మాణిక్యవాచకార్ ! యికమీదట నీ సేవను నాకే పూర్తిగా అంకితం చేసి, చిదంబరంలో నాలో లయమయిపో".

మాణిక్యవాచకార్ అరిమర్ధన పాండ్య వద్ద సెలవు తీసుకొని, చిదంబరమునకు వెళ్ళు. దారిలో ఉన్న శివాలయములో పరమేశ్వరుని స్తోత్రం చేస్తూ, ఆరాధిస్తూ, చివరకు చిదంబరం చేరాడు. చిదంబరులో ఒక బ్రాహ్మణ పూజారి మాణక్యవాచకారు వద్దకు వచ్చి కొన్ని తాళ పత్రములను, వాటిమీద వ్రాసే ఘంటములను ఆయనకిచ్చాడు. వెంటనే మాణిక్యవాచకార్ తన కీర్తనలన్నీ తాళపత్రములపై లిఖించాడు. ఆ పూజారి వాటిని తీసుకుని అదృశ్యమయ్యాడు. తరువాత నటరాజస్వామి పాదారవిందముల వద్ద తిరుచిత్రాబళము అనే స్వామి సంతకముతో తాలపత్రాలు లభించాయి.

దేవాలయము దీక్షితార్లు (పూజారులు) స్వామివారి దివ్య సంతకముతో తాళపత్రాలను చూసి, ఆశ్చర్య చకితులవుతుండగా వారికొక దివ్య వాణి వినిపించింది. ఆ ఆలయం బయట ఉన్న ఆ తాళపత్ర రచయిత మాణిక్య వాచకార్ ఆలయ గర్భాలయములోకి తీసుకుశిరమ్మని ఆజ్ఞాపించింది. స్వామి ఆజ్ఞానుసారం వెంటనే మాణిక్యవాచకార్‌ను గర్భగుడిలో స్వామి సన్నిధికి తీసుకు వచ్చారు. అక్కడ ఉన్న పూజారులందరికీ పరమాశ్చర్యంగా ఒక తృటికాలంలో మాణిక్య వాచకార్ నటరాజ స్వామిలో లీనమయిపోయాడు!


**కావలెను!**

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవరప్రసాద బాటు ట్రస్ట్ హాస్పిటల్‌లో పనిచేయుటకు క్వాలిఫైడ్ డాక్టర్లు, నర్సులు కావలెను. రిటైర్ అయి, సేవాభావము కలవారు ఆసక్తి ఉన్నచో డా॥ అశోక్ కుమార్ వర్మ ఛీఫ్ మెడికల్ సూపర్నిడెంట్‌ను ట్రస్ట్ హాస్పిటల్‌ను సంప్రదించగలరు. ఎంపిక చేయబడినవారికి తగిన వేతనము, వసతి సదుపాయములు సమకూర్చబడును. సెల్ నెం. 91- 93976 33277

- ట్రస్ట్ హాస్పిటల్

(గతసంచిక తరువాయి)

**విష్ణు**  **కథలు**

-రమణ ప్రసాద్

# 2. శ్రీ జయదేవుడు

శ్రీజయదేవుడు ఒరిస్సాలోని బిల్వగాం అనే గ్రామంలో జన్మించాడు. ఆ గ్రామం పవిత్రమైన శ్రీజగన్నాథ క్షేత్రానికి దగ్గరలోఉంది. ఆయన తండ్రి పేరు భోజదేవుడు. తల్లి పేరు రమాదేవి. భగవత్కటాక్షంచేత జయదేవుడు పిన్న వయస్సులోనే సకల విద్యాపారంగతుడు అయినాడు. ఆయన గీత గోవందం అనే కావ్యాన్ని రచించాడు. ఇది కృష్ణుడి ప్రేమకు సంబంధించిన కావ్యం. సంగీత ప్రధానమైన రచన. ఇందులో 12 సర్గలూ, 24 గీతాలూ,93 శ్లోకాలూ ఉన్నాయి. ప్రతి గీతంలో 8 చరణాలు ఉంటాయి. కనుక ఈ గీతాలను 'అష్టపదులు' అనే పేరుతో కూడా పిలుస్తారు. అసలు అష్టపది అనగానే జయదేవుడి పేరు గుర్తుకి వస్తుంది.



ఆ దేశపు రాజైన సాత్యకి కూడా జగన్నాధుని గుణగణాలను కీర్తిస్తూ ఒక గ్రంథం రచించాడు. పండితులు " ఓ రాజా! నీగ్రంథం జయదేవుల గ్రంథానికి ఎక్కడ సాటి? జయదేవుల గ్రంథం మాకు శ్రవణ, పఠన యోగ్యమైనది" అనిరి. దానికి ఆ రాజు " ఓ పండితులారా! ఈరెండు గ్రంథాలూ శ్రీ జగన్నాధుని సన్నిధిని ఉంచి చూద్దాం. శ్రీ వారు ఏగ్రంథాన్ని తన సన్నిధిని ఉంచుకుంటాడో అదే ఉత్తమమమైన గ్రంథం అని నిర్ణయిద్దాం" అన్నాడు. పండితులు రెండు గ్రంథాలూ శ్రీ జగన్నాధుని సన్నిధిలో ఉంచి ఆలయం తలుపులు మూశారు. మర్నాడు తలుపులు తెరిచి మందిరంలో ప్రవేశించిచూస్తే శ్రీజయదేవుల గ్రంథం భగవత్సన్నిధిలో ఉంది. రాజు రచించిన గ్రంథం వెలుపల పారవేయబడి ఉంది. రాజు ఖిన్నుడై "ప్రభూ!నువ్వు ఆశ్రితులనందరినీ సమానంగా చూస్తావు కదా!శ్రీజయదేవుల గ్రంథాన్ని అంగీకరించి నా గ్రంథాన్ని పరిగ్రహించావు. ఈ అవమానమును నేను

భరించలేను. నీ పాదాలవద్ద నా శిరస్సును అర్పిస్తాను'' అని దుఃఖిస్తున్న రాజుకు కలలో శ్రీమన్నారాయాణుడు కనపడి “ నీ గ్రంథమునుండి 24 శ్లోకాలను శ్రీజయదేవుల గ్రంథంలో చేర్చాను'' అని చెప్పి రాజును తృప్తి పరిచాడు.

శ్రీ జగన్నాధ క్షేత్రంలో నివసించే ఒక బ్రాహ్మణునికి ఒక స్త్రీ సంతానం కలిగింది. ఆమె కన్నుల సొగసు చూసి పద్మావతి అని పేరు పెట్టారు. తమ పుత్రికకు శ్రీమన్నారాయణుడే భర్త కావాలి అనే మనోరథముతో ఉన్నారు ఆమె తలిద్రండ్రులు. శ్రీ జగన్నాధుడు కలలలో కనిపించి “నీ పుత్రికను నా సమ్మతి ప్రకారం నా అంశయైన జయదేవునికి ఇచ్చి వివాహం చెయ్యి'' అని ఆజ్ఞాపించాడు. ఆ బ్రాహ్మణుడు ఒక శుభ ముహూర్తంలో భగవన్నియమానుసారంగా కన్యాదానం చేశాడు.

ఆ సమయంలో ఒక సద్గుణ సంపన్నుడైన వ్యాపారి, శ్రీజయదేవులకు భక్తి తో నమస్కరించి “ మీరు నా ఊరికి వచ్చి నా ఇంట్లోనివాసం చేయ''మని ప్రార్థించగా శ్రీ జయదేవులు అంగీకరించి ఆవర్తకుని ఇంట్లో ఉంటూ హితోపదేశం చేస్తున్నాడు. కొన్నాళ్ళ తరువాత జయదేవులు తిరిగి జగన్నాధ క్షేత్రానికి వెళ్ళాలని చెప్పగా, ఆ వర్తకుడు ఒకరథాన్ని సిద్ద చేయించి జయదేవులు నిరపేక్షులు కనుక ఆయనకు తెలియకుండా ఆరథంలో రత్నాలు, ఆభరణాలు. కొంత ధనము ఉంచి ఇద్దరు సేవకులను పిలిచి “ ఈ ద్రవ్యాన్ని శ్రీజయదేవుల భార్యకు అందించండి'' అని చెప్పాడు. దారిలో “మాకు పని ఉన్నది .మా ఊరికి పోవటానికి అనుజ్ఞ ఇవ్వ''మని వారు దుర్బుద్దితో ఆధనాన్ని అపహరించి, జయదేవుల కాళ్ళు, చేతులు నరికి ఒక పాడునూతిలో పారేసి వెళ్ళిపోయారు.

శ్రీ జయదేవులు ఆ నూతిలో భగవద్ధ్యానంలో మేను మరచి పరవశులై ఉన్నారు. ఆ సమయంలో వింధ్య దేశాన్ని పాలించే మహరాజు అటుగా వచ్చి, ఆ నూతినుండి ప్రకాశం రావటం చూసి ఆశ్చర్యంతో ఆ నూతిలో ధ్యానయోగపరులై ఉన్న శ్రీజయదేవులను బయటకు తీసి, ఈ దురవస్థకు కారణం ఏమిటి అని అడిగారు. శ్రీజయదేవులు సేవకుల దోషం బయట పెట్టకుండా, “ నాకు పుట్టుకనుండి కాళ్ళు, చేతులు లేని కారణంగా రాత్రి సమయంలో ఈ నూతి పడ్డాను'' అని చెప్పారు. రాజు శ్రీ జయదేవులను ఒక పల్లకీలో కూర్చుండబెట్టుకొని తన రాజ్యానికి తీసికొనిపోయి సకల ఉపచారాలు చేసి పూర్ణ స్వస్థునిగా చేశారు.

ఒకనాడు రాజు“మోక్షమునకు సులభ సాధనము ఏది?'' అని

ప్రశ్నించాడు. శ్రీ జయదేవులు " సాధువులను ఆరాధించుటకంటె గొప్ప ధర్మం లేదు. సాధువులకు పరి చర్య చేస్తే మోక్షం లభిస్తుంది'' అని చెప్పాడు. రాజు జయదేవుల ఆజ్ఞను పాటించి, సాధువులను అన్నపానాదులచే గౌరవించి ఆరాధిస్తున్నాడు.

శ్రీజయదేవులను హింసించిన క్రూర సేవకులు సాధు వేషాలలో రాజ సత్కారాలు పొందటానికి రాజ మందిరంలో ప్రవేశించారు. అక్కడ జయదేవులను చూసి భయంతో వణికిపోయారు. పరమ శాంతులైన శ్రీజయదేవులు వారిని సగౌరవంగా ఆహ్వానించి, సన్మానించి,ఆలింగనం చేసుకొని " వీరు పరమభాగవతులు. వీరిని రాజువద్దకు తీసుకుపోయి వారికి ఘన సన్మానం చేయమనని నా మాటగా చెప్పండి.'' అని చెప్పాడు.

రాజు వారిని సత్కరించి "నన్ను అనుగ్రహించి నా ఆతిధ్యం స్వీకరించి కొన్నాళ్ళు నా రాజభవనంలో ఉండ''మని ప్రార్థించాడు. జయదేవులు తమ రహస్యం బయటపెడితే ఎక్కడ దండన జరుగుతుందో అనే దిగులుతో వారు నానాటికీ కృశింపసాగారు.

జయదేవులవారు ఇది గమనించి రాజుతో "వీరు క్షణమొకచోట ఉండెడివారు కారు. నీ భాగ్యంచేత ఇన్నాళ్ళు ఉన్నారు. వీరిని స్వేచ్ఛగా పంప'' మని చెప్పగా రాజు రెండు రథాలను సిద్ధపరిచి అపరిమిత రత్నాభరణధనరాసుల నిచ్చి సైనికులను తోడుగా ఇచ్చి పంపాడు. భటులు ఆ వంచకులను చూసి " మా రాజు వద్దకు అనేకమంది భాగవతులు వస్తారు. వారెవ్వరినీ శ్రీజయదేవులు మిమ్మల్ని సన్మానించినంతగా సన్మానించలేదు. దానికి కారణం ఏమిటి?''అని అడుగగా వారు " అనంతదేశపు రాజు వద్ద శ్రీజయదేవులు ప్రధానులై ఉన్నప్పుడు ఏదో మహాపరాధం చేసిన కారణంగా రాజు కోపించి శ్రీజయదేవులను వధించి రమ్మని మాకు ఆజ్ఞాపించారు.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL